వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

మీ లక్ష్మీ దీపపు ఒత్తులు
కార్తీక దామోదర స్వామి కొరకు
ఆర్డర్ చేయండి
నేరుగా మీ ఇంటికే అందించ బడతాయి
పువ్వు ఒత్తులు..కాడ ఒత్తులు..365 ఒత్తులు..కమలం ఒత్తులు
9248547596 కశింకోట
Speed Post and APSRTC DOOR DELIVERY....48 to 72 hours లో

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 59 విశాఖపట్నం, 08 డిసెంబరు 2022 గురువారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఓటరు నమోదుపై కలెక్టర్ నేతృత్వంలో శిక్షణా కార్యక్రమం






**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటర్ల సవరణ జాబితాలు త్వరిత గతిన సిద్ధం చేసేందుకు సచివాలయంలో ఉన్న బిఎల్వోలు అత్యంత శ్రద్ధగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లికార్జున అన్నారు. బుధవారం ఉదయం జిల్లాలో గల అందరి ఈఆర్వోల పరిధిలో గల సచివాలయ బిఎల్వోల తో ఈ విషయంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా 2023 తయారు చేసేందుకు జిల్లాలో గల 18 -19 సంవత్సరాలు మధ్య గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని , అందుకు సచివాలయ బిఎల్వోలు ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించాలని అన్నారు . ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా కొత్త దరఖాస్తుల స్వీకరణ ,తొలగించాల్సిన పేర్లను పరిశీలించి వేగవంతంగా ఆన్లైన్ చేయాలని ఆదశించారు. 18 -19 వయస్సు మధ్య గల వారందరిని ఫారం-6 ద్వారా కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను వారి సంబంధిత బంధువుల నుండి ఫారం-7 ద్వారా తీసుకొని ఓటర్ల జాబితా నుండి వారి పేర్లను తొలగించాలని తెలిపారు. అలాగే డబుల్ ఓటర్లను గుర్తించి వారికి ఓటు ఎక్కడ ఉండాలో నిర్ణయించి రెండవ ఓటు తొలగించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్ళిన వారిని గుర్తించి వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని సూచించారు. ఒక (మిగతా 2లో)

## విశాఖ సీఐటీఎస్‌లో నైపుణ్య శిక్షణ

**న్యూఢిల్లీ:** మహిళలకు నైపుణ్య శిక్షణ కోసం దేశంలో ప్రత్యేకంగా 19 జాతీయ మహిళా నైపుణ్య శిక్షణా సంస్థలు (ఎన్ఎస్టీఐ) పనిచేస్తున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడించారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా 33 ఎన్ఎస్టీఐలు వాటికి అనుబంధంగా మూడు కేంద్రాలు నెలకొల్పినట్లు తెలిపారు. ఇందులో 19 ఎన్ఎస్టీఐలు ప్రత్యేకంగా మహిళల కోసం నెలకొల్పినవే. విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్ (హైదరాబాద్)లో మూడు ఎన్ఎస్టీఐలు నెలకొల్పగా అందులో ఒకటి మహిళల కోసం ప్రత్యేకించిందని మంత్రి చెప్పారు. విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ఎస్టీఐ నెలకొల్పలేదని చెబుతూ విశాఖపట్నం గాజువాకలోని క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ ట్రైనర్స్ (సీఐటీఎస్)ను అనుబంధ సంస్థగా ప్రకటించి 2022-23 నుంచి ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్, వెల్డర్ వంటి ట్రేడ్లలో శిక్షణను ప్రారంభించ బోతున్నట్లు చెప్పారు. ఈ మూడు ట్రేడ్లలో 75 మందికి శిక్షణ పొందే అవకాశం ఉన్నట్లు మంత్రి తెలిపారు.

## ఒక జిల్లా-ఒక ఉత్పత్తిపై ఎంపీ సత్యవతి చర్చ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఒక జిల్లా ఒక ఉత్పత్తి పథ కం లక్ష్యాన్ని వివరించాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బిశెట్టి వెంకట సత్యవతి లోకసభ లో ప్రశ్నించారు. ఇప్పటివరకు ఈ స్కీం కింద సాధించిన విజయాలు వివరించాలని కోరారు. అలాగేపథకం అమలకు ఆంధ్ర ప్రదేశ్లో గుర్తించిన ప్రదేశాలను తెలపాల న్నారు. ఎగుమతులకు సంబంధించి తీసుకున్న చర్యలు ప్రణాళికలు ను కోరారు. విషయమైవాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖలో రాష్ట్ర మంత్రి సోమ్ ప్రకాష్ బదులిస్తూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఒక జిల్లా ఒక ఉత్పత్తి ని ప్రారంభించిందన్నారు. ఇది ఒక జిల్లా యొక్క నిజమైన సామ ర్థ్యాన్ని గ్రహించడం, ఆర్థిక వృద్ధికి ఆజ్యం పోయడం, ఉపాధి , గ్రామీణ వ్యవస్థాపకతను పెంపొందించడానికి దోహద పడిందన్నారు. ఓ డి ఓ పి ఇనిషి యేటివ్ దేశంలోని అన్ని జిల్లాల్లో సమ తుల్య ప్రాంతీయ అభివృద్ధిని పెంపొం దించడం, అన్ని ప్రాంతాలలో సంపూర్ణ సామాజిక-ఆర్థిక వృద్ధిని సాధించడం లక్ష్యంగా కొనసాగుతుంది అన్నారు. జిల్లాలో ఎగుమతి సామర్థ్యం ఉన్న ఉత్పత్తులను గుర్తించడం ద్వారా తయారీ మరియు ఎగుమతి కేంద్రంగా మార్చడానికి దేశంలోని జిల్లా యూని ట్‌గా దృష్టి సారించడమే లక్ష్యంగా జరుగుతుందన్నారు. ఈ సందర్భంలో, జిల్లాల ఎగుమతి కార్యాచరణ ప్రణాళి కలు స్థానికంగా మద్దతు ఇవ్వడానికి అవ సరమైన నిర్దిష్ట చర్యలను కలిగి ఉం టాయన్నారు. ఎగు మతిదారులు తయా రీదారులు తగిన పరిమాణంలో గుర్తించిన ఉత్ప త్తులను ఉత్పత్తి చేయడం తయారీ చేయడం జరుగుతుందన్నారు.

ఈ ప్రణాళికలలో ఎగుమతుల కోసం సవాళ్లను గుర్తించడం మరియు అది పరిష్కరించడం కూడా ఉందన్నారు. ప్రభుత్వంపై ఓడి ఓపి జిఇఎం బజార్ ప్రారంభించబడిందన్నారు. ఆగస్టు 29 2022, దేశవ్యాప్తంగా ఓడిఓపి ఉత్పత్తుల అమ్మకాలు, సేకరణను ప్రోత్సహిం చడానికి ప్లాట్‌ఫారమ్‌లో 200కి పైగా ఉత్పత్తి వర్గాలను సృష్టించినట్లు పేర్కొన్నారు. ఓడి ఓపి ఉత్ప త్తులు మే 2022లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, డీ ఏ వివో ఎస్ వంటి వివిధ అంతర్జాతీయ ఫోరమ్‌లలో ప్రదర్శిం చబడతాయని తెలిపారు. ఏపీలో విశాఖ పట్నం అన కాపల్లి కి సంబంధించి కొబ్బరి ఉత్ప త్తులు, జీడిపప్పు, అల్లం , ఏటి కొప్పాక బొమ్మలు ఉత్పత్తులు, మినరల్స్ సంబంధించిన ఉత్పత్తులు , సముద్ర ఉత్పత్తులు, పెప్పర్, అరకు కాఫీ, తేనె, చేతి వృత్తికి సంబంధించి తదితర ఉత్పత్తులను గుర్తించామన్నారు.

## ఏయూతో గరుడలైటిక్స్ ఎంఓయూ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంతో గరుడ లైటిక్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఒప్పంద ప్రతాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, గరుడలైటిక్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ వి.ఎస్.ఎస్ కిరణ్‌లు సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే దిశగా వివిధ పరిశ్రమలతో కలసి పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు నిరంతర అభ్యాసకులుగా నిలవాలని సూచించారు. భవిష్యత్తులో డ్రోన్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని, పర్యవేక్షణ, నిర్వహణ, సర్వే, ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయడం వంటి అంశాలలో డ్రోన్స్ వినియోగిస్తారన్నారు. డ్రోన్‌లో శిక్షణ, సమాచార విశ్లేషణ జరిపే జిఐఎస్ రంగాలలో పనిచేస్తున్న రెండు సంస్థలతో వరుసగా అవగాహన ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. ఇటువంటి నూతన సాంకేతిక అంశాలను విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో ఏయూ జరిపే ఎంఓయూలు అన్నీ విద్యార్థుల సమక్షంలో నిర్వహిస్తామన్నారు.

ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేవిధంగా సిలబస్‌లో మార్పులను చేస్తున్నామన్నారు. విభాగాధిపతి ఆచార్య వజీర్ మహ్మద్ మాట్లాడుతూ జిఐఎస్ రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జియో ఇంజనీరింగ్ విభాగాన్ని అభివృద్ధి చేస్తున్న విధానం వివరించారు. కార్యక్రమంలో గరుడలైటిక్స్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ వి.ఎస్.ఎస్ కిరణ్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గెడ్డల ఆధునీకరణకు సమిష్టిగా కృషి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గెడ్డల ఆధునీకరణకు దేవాదాయ, రెవెన్యూ, పోర్ట్ ట్రస్ట్, నేవల్ అధికారుల సమన్వయంతో వారి పరిధిలో ఉన్న గెడ్డలను మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని జివిఎంసి కమిషనర్ పి రాజా బాబు పేర్కొన్నారు. బుధవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా జోన్-5, 57వ వార్డు నందు సాకేతికపురం, ఎన్ఏడి కొత్త రోడ్డు, ఎన్ఏడి ఆఫీస్, ఎన్ఏడి పరిధిలో ఉన్న గెడ్డలను నేవల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింహాచలం, మురళినగర్, గోపాల్ పట్నం తదితర ప్రాంతాలలోని గెడ్డలు, నేవల్ ప్రాంతాల గుండా ప్రవహిస్తున్నందున ఆయా ప్రాంతాలలో గెడ్డలను శుభ్రం చేయుటకు ఆటంకాలు ఎదురవుతున్న దృష్ట్యా వివిధ డిపార్ట్మెంటుల అధికారులతో సమీ క్షా సమావేశం ఏర్పాటు చేసి అందరి సహకారంతో గెడ్డల ఆధునీకరణకు కృషి చేస్తామని కమిషనర్ నేవల్ అధికారులకు వివరించారు. గెడ్డలు శిధిలావస్థలో ఉన్నందున మురుగు పోయేందుకు ఆటంకం ఏర్పడుతుందని, ఎప్పటి నుండో కాలువల్లోనే సిల్ట్ ఉన్నందున కాలువలు పూడుకుపోయాయని వీటిని తీసేందుకు దేవాదాయ శాఖ, పోర్టుట్రస్ట్, రెవిన్యూ, జివిఎంసి సంయుక్తంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా వర్షాకాలంలో గెడ్డలో పూడుకులు అధికంగా ఉన్నందున సమీప ఇళ్లలోకి వరద నీరు చేరుతుందని, అంతేకాకుండా పందులు అధికంగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్నందున పర్యావరణపరంగా ఇబ్బంది ఏర్పడుతుందని, నేవల్ ప్రాంతాలలో గెడ్డలు ప్రవహించినందున వ్యర్థాలను అడ్డుకునేందుకు గ్రిల్స్ ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని, అందుకు మరోమారు సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి శాశ్వత పరిష్కారం అయ్యేందుకు తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ నేవల్ అధికారులకు తెలియజేశారు.

ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఆర్.జి.బి. కృష్ణ, ఏసిపి అరుణ వల్లి, కార్య నిర్వహక ఇంజనీరు, ఏఎంఓహెచ్ డాక్టర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ
వధూవరుల వివాహ పరిచయ వేదిక
తేదీ:25డిసెంబర్ 2022
ఉదయం 10గంటల నుండి.
వేదిక: శ్రీ కామాక్షి పీఠం, కృష్ణా రావు వీధి
కూచిమంచి వారి అగ్రహారం
అమలాపురం, కోనసీమ జిల్లా.
అన్ని వయసుల వారికి తగిన
సుమారు 500మంది వధూవరుల వివరములు కలవు.
ఒక సారి రిజిస్ట్రేషన్ చేయండి
వివాహం కుదిరేవరకు సేవలు పొందండి.
ఆరేళ్ళలో 1200 పైగా వివాహాలు జరిగిన
విజయవంతమైన వివాహ వేదిక
జనహిత మ్యాట్రిమోనీ, విశాఖపట్నం.
ఫోన్లు: అమలాపురం: 85558 06336 హరి.
విశాఖపట్నం: 9393949345,
కాకినాడ: 99494 13661 కె.బి.రామారావు &
7013128088.ఆర్.వి.టి. సత్యనారాయణ
వైజాగ్ ఆఫీస్: 7382962196
8054841293 కె.వి.శర్మ

(మొదటి పేజీ తరువాయిలు)

## ఓటరు నమోదుపై కలెక్టర్ నేతృత్వంలో శిక్షణా కార్యక్రమం

పోలింగ్ స్టేషన్ పరిధిలో నివాసం ఉండి వేరే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదై ఉంటే ఫారం -8 ద్వారా సరిచేయాలని సూచించారు. అదేవిదంగా తమ పరిధిలో గల కాలేజీలకు వెళ్లి జగనన్న విద్యా దీవెన జాబితా ద్వారా విద్యార్థుల నుంచి ఓటు నమోదుకు అవగాహన కలిగించాలని తెలిపారు. వీటిని తమ సచివాలయ పరిధిలో గల వారిని అదేరోజు ఆన్లైన్ లో నమోదు చేయాలని, మిగిలిన జాబితా సంబంధిత ఎఈఆర్వో లకు అందజేయాలని అన్నారు. అదేవిధంగా ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియలో చాలా వెనుకబడి ఉన్నామని ఫారం 6బి ద్వారా వేగవంతం చేయాలన్నారు. ఎలక్షన్ పాపులేషన్ నిష్పత్తి అధికంగా ఉన్నచోట పరిశీలించి ఓట్ల తొలగింపు , బదిలీ ప్రక్రియ చేయాలన్నారు .

అనంతరం డిఆర్వో శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ సచివాలయ పరిధిలో గల ప్రతి బిఎల్వో 18-19 వయస్సు గల ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదుకు ఇంటింటికీ తిరగాలని , జగనన్న విద్యా దీవెన డేటా ద్వారా ఆధారంగా కాలేజీలకు తిరిగి సేకరించాలని అన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో ఈఆర్వో జ్యోతి మాధవి, ఎఈఆర్వో ,తూర్పు నియోజకవర్గంలో గల సచివాలయ బిఎల్వోలు పాల్గొన్నారు.

## యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించండి

**విజయనగరం:** జీవనోపాధికి ఉద్యోగం ఒక్కటే మార్గం కాదని, స్వయం ఉపాధి రంగంలో అనేక మార్గాలు ఉన్నాయని.. వీటిపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. యువతను ప్రధానంగా స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలని సూచించారు. కేవలం ఉద్యోగాల కోసమే అందరూ ప్రయత్నిస్తే సంపూర్ణ స్థాయిలో అవకాశాలు రావని ఆమె అభిప్రాయపడ్డారు. వివిధ ప్రయివేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం తన ఛాంబర్లో ఆమె ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. యువత - ఉపాధి, ఓటు నమోదు, సామాజిక పరివర్తన తదితర అంశాలపై సమీక్షించారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ప్రధాన దశ అని ఇక్కడే వారిలో మానసిక పరివర్తన కలిగేలా శిక్షణ అందించాల్సి ఉందని పేర్కొన్నారు. వారిలో మానవతా విలువలను పెంపొందించాలని, పెద్దలంటే గౌరవం పెరిగేలా పరివర్తన తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., ఎన్.వై.కె. గ్రూపుల్లో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 17 సంవత్సరాల వయసు వచ్చిన వారందరూ తప్పకుండా ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

## సుప్రీంకోర్టు మొబైల్ యాప్ 2.0ను ప్రారంభించిన భారత ప్రధాన న్యాయమూర్తి



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు మొబైల్ యాప్ 2.0ను ప్రారంభించినట్టు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. సుప్రీంకోర్టు కార్యక్రమాలు బుధవారంనాడు ప్రారంభం కావడానికి ముందు సీజేఐ ఈ విషయం తెలియజేశారు. న్యాయ అధికారులు, వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన నోడల్ ఆఫీసర్లు తమ కేసులను ట్రాక్ చేసుకునేందుకు కొత్త ఫీచర్లతో రూపొందించిన ఈ యాప్ వీలు కల్పిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసులు, స్టేటస్ ఆర్డర్లు, తీర్పులు, దాఖలు చేసిన ఏవైనా ఇతర పత్రాలను యాప్‌లోకి వెళ్లి పరిశీలించవచ్చని తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. మరో వారం రోజుల్లో ఐఓఎస్ వెర్షన్ కూడా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కరోనా సమయంలో కోర్టు ప్రొసీడింగ్స్‌ను వర్చువల్ తరహాలో చూసేందుకు అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వీ.రమణ కొద్ది మంది మీడియా వ్యక్తులను అనుమతించారు.

## "స్పందన"లో 12 ఫిర్యాదులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):**జివిఎంసి పరిధిలో ఉన్న ఎనిమిది జోన్లలో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగంలో అధికంగా వస్తున్న ఫిర్యాదులు నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ పి. రాజాబాబు టౌన్ ప్లానింగ్ ఫిర్యాదుల కోసం ప్రతి బుధవారం ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంలో భాగంగా చీఫ్ సిటీ ప్లానర్ బి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో డిసిపిలు, ఏసీపీలు టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ స్పందన కార్యక్రమంలో 12 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జివిఎంసి పరిధిలో ఎలాంటి అనాధికార నిర్మాణాలు జరుగుతున్న, నిబంధనల ఉల్లంఘించి భవనాలు నిర్మించిన, భవన నిర్మాణ వ్యర్థాలపై, టౌన్ ప్లానింగ్ విభాగం పై ఎలాంటి ఫిర్యాదులనైనా ప్రత్యేక టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశామని ఈ ఫోన్ నెంబర్ కు 8187897569 ఫిర్యాదులు ప్రతి రోజూ నేరుగా తమ సమస్యను తెలియజేయవచ్చునని కమిషనర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వచ్చిన ఫిర్యాదులను దిగువ స్థాయి సిబ్బంది నుండి పై అధికారి వరకు వివరణ అడిగి తెలుసుకొని వచ్చిన అర్జీని తక్షణమే పరిష్కారమయ్యే విధంగా చూడాలని చీఫ్ సిటీ ప్లానర్ ని ఆదేశించారు.

# రైతులు దగ్గరుండి భూ సర్వే చేయించుకోవాలి

విజయనగరం, డిసెంబర్ 07 : భూముల రీసర్వే నిర్వహిస్తున్నప్పుడు రైతులు దగ్గరుండి తమ భూముల కొలతలు తీయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. రైతుల సమక్షంలోనే వారి భూములను సర్వే చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియ ఒక సువర్ణావకాశం లాంటిదని, దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దాదాపు వందేళ్ల తరువాత జరుగుతున్న ఈ భూ సర్వే ప్రక్రియ పూర్తయితే, భూ సమస్యలకు, వివాదాలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా జరుగుతోందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి దశలో భాగంగా ఇప్పటి వరకు 24 మండలాల్లోని 179 గ్రామాల్లో సమగ్ర భూ సర్వే పూర్తయ్యిందని, సుమారు 11వేల మందికి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం ద్వారా, వారి భూములపై సర్వ హక్కులను కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు అపోహలను విడనాడి, అధికారులకు పూర్తి స్థాయిలో సహకరిస్తే, సమగ్ర భూ సర్వేను మరింత విజయవంతంగా వేగంగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. భూ సర్వే నిర్వహిస్తున్నప్పుడు, రైతులు తప్పనిసరిగా తమ భూములవద్ద ఉండి, ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని, అక్కడే సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనికోసం ముందుగానే ఆయా రైతులకు సమాచారం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

**ఎన్నో ఉపయోగాలు**

సర్వే వల్ల సాదా బై నామా ద్వారా జరిపిన లావాదేవీలకు శాశ్వత హక్కులు లభిస్తాయని, ప్రభుత్వ, దేవాదాయ భూములకు రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న జీవితకాల సమస్యలకు ఈ సర్వేద్వారా పరిష్కారం లభిస్తుందని ఉద్ఘాటించారు.

ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ రైతులు తిరగాల్సిన పనిలేదని, పైసా ఖర్చు లేకుండా తన ఆస్తికి సర్వ హక్కులూ లభిస్తాయని తెలిపారు. ఈ సర్వే ప్రక్రియ ద్వారా సాగుచేసుకుంటున్న పొలాలతో పాటు 4 లక్షల ఖాతాలకు సంబంధించిన గ్రామ కంఠాలకు, సాదా బై నామా ద్వారా జరిగిన లావాదేవీలకు కూడా సంపూర్ణ హక్కులు లభిస్తాయని వివరించారు. వారసత్వంగా వచ్చిన భూములకు కుటుంబ సభ్యుల సమక్షంలోనే చిటికెలో పరిష్కారం లభిస్తుందన్నారు. సరిహద్దు గొడవులు.. పంపకాల చిక్కులు తొలగిపోతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జరుగుతున్న ఈ సర్వే వల్ల భూములకు సంబంధించి ప్రత్యేక ఎల్.పి.ఎం. నంబర్ ద్వారా అన్ని వివరాలు క్యూ ఆర్ కోడ్‌లో నిక్షిప్తమై ఉంటాయని, దీంతో భవిష్యత్తులో సంబంధిత రైతుల అనుమతి లేకుండా పేర్లు గానీ, సరిహద్దులు గానీ మార్చలేరని తెలిపారు. చివరికి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు కూడా ఓటీపీ వస్తే గానీ ప్రక్రియ ముగియదన్నారు. అత్యంత కచ్చితత్వం, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ 20వేల సర్వే

# వేతన సవరణ చేయకపోతే ఆందోళన తప్పదు: ఇంటక్



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు వేతన సవరణ చేయడంతో యాజమాన్యం, గుర్తింపు యూని యన్ విఫలమయ్యాయని ఇంటర్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. ప్లాంట్ ఎల్ఎంఎంఎం పార్కులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో కీలక పాత్ర వహిస్తున్న కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఆర్థిక ప్రయోజనా లకు పూర్తిగా గండిపడిందని, దీంతో కార్మికులు వేలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. వేతన సవరణ విషయంలో ఎన్ఎసిఎస్ ఒప్పందం జరిగిందని, కానీ నేటి వరకు స్టీల్ప్లాం ట్లో ఒప్పందం జరగలేదని, సెయిల్, కార్మికులు ఇప్పటికే నూతన వేతనాలు తీసుకుంటున్నా. రని, వేతన సవరణ చేయకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయో జనాలపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయా విభాగాల్లో కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వీటిని పరిష్కరించేందుకు యాజమాన్యం ముం దుకు రావాలన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చి రిఫరల్ విధానం కార్మికులకు అనుకూలంగా చేయాలన్నారు. పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్లాంట్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, దీని వలన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పనిభారం పడిందని, నూతన రిక్రూట్ చేయాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పిం చాలన్నారు. అర్హులైన నాన్-ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్మిక సమస్యలపై యాజమాన్యంతో చర్చించామని, సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే యాజ మాన్యంకు విన్నవించి డిమాండ్ చేశామన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్ఏ, నాయుడు, కొవిరి అవతారం, అకుల నూకరాజు, మద్ది అప్పలరాజు, కృష్ణా, రావు, వెంకటరాజు, బిటి.జగదీష్ గొందేశి ప్రభాకర్ రెడ్డి, గోపాల్రాజు, కొమ్ము ప్రసాద్, పీవీ.ర మణమూర్తి, బీఎస్ రాజు, పీవీ. నగేష్, మంత్రి గోపినారాయణ, ఎంఎస్ఆర్.ప్రసాద్, రమణయ్య, గంగవరం గోపి పాల్గొన్నారు.

# త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ను ఏర్పాటు చేసి దాని విధివిదానాలను ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక సిరిపురం ఉడా చిల్డ్రన్ థియేటర్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విన్నర్స్ మరియు రన్నర్స్ 450 మందికి సర్టిఫికేట్స్ మరియు బహుమతులను జిల్లా కలెక్టర్ అందజేసారు. అదే విదంగా అర్హులైన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహనాలు, నలుగురికి లాప్ ట్యాప్ లు మరియు ఇద్దరికి టచ్ పోన్లను పంపిణీ చేసారు. స్వయం ఉపాధి పథకం కింద మరో ముగ్గరికి 8 లక్షల రూపాయలను పంపిణీ చేసారు. అనంతరం విభిన్న ప్రతి భావంతులు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించారు.

ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ రమణమూర్తి, డి ఇ ఓ చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, పిఐఎస్ఎస్ఎ శ్రీనివాసరావు, ఆర్.సి.డి. హస్పటల్ సూపరింటెండెంట్ విఠల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

బంగాళాఖాతంలో వాయుగుండం మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారింది. ప్రస్తుతం ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతాలను ఆనుకుని ఉన్న ఈ తీవ్ర వాయుగుండం చెన్నైకి తూర్పు ఆగ్నేయ దిశగా 770 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది.

ఇది క్రమేపీ పశ్చిమ వాయవ్య దిశగా కదిలి నేటి సాయంత్రానికి తుపానుగా రూపాంతరం చెందనుంది. రేపు (డిసెంబరు 8) ఉదయానికి ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు చేరువలోకి రానుంది.

దీని ప్రభావంతో డిసెంబరు 8న తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతం, కారైక్కాల్ ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. అదే సమయంలో ఏపీ దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. డిసెంబరు 9న ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఐఎండీ హెచ్చరించింది.

డిసెంబరు 10న తుపాను తీవ్రత కాస్త తగ్గుతుందని, ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడొచ్చని వివరించింది.

నేటి సాయంత్రం నుంచి తీర ప్రాంత జిల్లాల్లో గాలుల తీవ్రత పెరగనుందని, డిసెంబరు 8 సాయంత్రం నుంచి డిసెంబరు 9వ తేదీ ఉదయం వరకు 100 కిమీ వేగంతో గాలులు వీస్తాయని, ఆపై క్రమంగా గాలుల వేగం తగ్గుతుందని ఐఎండీ పేర్కొంది. నేటి నుంచి సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, ఈ నెల 10వ తేదీ వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

పంచాంగం

గురువారం 08-12-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం హేమంత రుతువు
మార్గశిర మాసం

తిథి : బ. పూర్ణిమ ఉ. 09.39
నక్షత్రం : రోహిణి మ. 12.34
వర్జ్యం : సా. 06.44 . ల 08.29



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.
సెల్ : 9440537607

## పోలవరం ముంపుపై ఏకాభిప్రాయం సాధనకు ప్రయత్నించండి :సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** పోలవరం ముంపుపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పోలవరంతో తమ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయంటూ.. తెలంగాణ, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ పిటిషనర్లు పిటిషన్లు దాఖలు చేశారు. సీఎంల సమావేశం నిర్వహించలేదని కోర్టుకు పిటిషనర్లు తెలిపారు. ఈ అంశంపై 2 నెలల్లోగా నివేదిక అందిస్తామని సీడబ్ల్యూసీ లాయర్ పేర్కొన్నారు. నివేదిక ఇవ్వడంతో పాటు ఏకాభిప్రాయం సాధనకు సీఎంల సమావేశానికి ప్రయత్నించాలని సుప్రీంకోర్టు సూచించింది. ముంపుతో నష్టపోతున్నందున పోలవరం పనులు ఆపాలని పిటిషనర్లు కోరారు. ప్రతి విషయంలో సీడబ్ల్యూసీ అలా చేయలేదని, రాష్ట్రాలే సమన్వయం చేసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 15కి ధర్మాసనం వాయిదా వేసింది.

## చెంచులకు వేతనంతో కూడిన ఉపాధి కొనసాగుతుంది

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని నల్లమల్ల అడవుల్లో నివసించే చెంచు తెగకు చెందిన ప్రజలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనంతో కూడిన ఉపాధి కల్పించేందుకు క్రియాశీలమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తెలిపాయని రాజ్యసభలో శ్రీ విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి రాతపూర్వకంగా తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం మార్గదర్శకాలలో చేసిన మార్పుల కారణంగా నల్లమల అడవులలో జీవించే చెంచు తెగకు చెందిన ప్రజలు ఈ పథకం కింద వేతనంతో కూడిన ఉపాధి పొందడానికి అనర్హులవుతారా అన్న ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ మార్గదర్శకాలను సవరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి విజ్ఞప్తి రాలేదని చెప్పారు.

## నేడు ఆపద మిత్ర శిక్షణా కార్యక్రమం

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఆపద మిత్ర శిక్షణా కార్యక్రమాన్ని గురువారం పార్వతీపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ప్రిన్సిపాల్ మరియు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా.ఎం.అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధ వారం ఒక ప్రకటన జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఆపద మిత్రలకు గురు వారం ఉదయం 9 గంటల నుండి బెలగాం లూథరన్ చర్చి ప్రాంగణం రెవరెండ్ పాల్ మెమోరియల్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. విపత్తులు సంభవించినపుడు ప్రాణ, ఆస్తి నష్టాలను, ఆరోగ్య సమస్యలు, ఉపాధి కోల్పోవడం వంటి సమస్యలను సమాజం ఎదుర్కొంటోందని ఆయన వివరించారు. విపత్తులలో కలిగే నష్టాలు, బాధల నుండి నివారణకు, అండగా ఉండుటకు ఆపద మిత్ర లను ఎంపిక చేసి శిక్షణ కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామ వాలంటీర్లు, ఆశాలు, హోం గార్డులు, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు తదితర వర్గాల నుంచి ఆపద మిత్ర లను ఎంపిక చేయడం జరిగిందని ఆయన చెప్పారు. శిక్షణా కార్యక్రమం 12 రోజుల పాటు సాగుతుందని ఆయన అన్నారు.

## సిట్ నివేదిక ఎలా బయటకు వచ్చింది?

ఎమ్మెల్యేల కొనుగోలు కేసు లో సిట్ దాఖలు చేసిన కౌంటర్ లీక్ అవడంపై హైకోర్టు లో వాదనలు జరిగాయి. రహస్యంగా ఉంచాలనుకున్న సిట్ నివేదిక ఎలా బయటకు వచ్చిందని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశ్నించారు. సిట్ కౌంటర్ కాపీలను పిటిషనర్లు, వారి తరపు న్యాయవాదులకు అందించామని అదనపు అడ్వకేట్ జనరల్ తెలిపారు. పిటిషనర్లు ఓ రాజకీయ పార్టీకి అందించారని వారి ద్వారా మీడియా లీక్ అయిందని ఏఏజీ తెలియజేశారు. ఫిర్యాదుదారుడైన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి ఓ కాపీ ఇచ్చామని ఆయన ద్వారా సీఎంకు చేరి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. కౌంటర్ కాపీ సిట్ ద్వారా బయటకు రాలేదని అదే రోజు పత్రిక ప్రకటనను సీవీ ఆనంద్ విడుదల చేశారని ఏఏజీ హైకోర్టుకు తెలియజేశారు.

# విశాఖ సమాచారమ్

గురువారం 08-12-2022


## జర్మనీ -భారత్ జతగా!

జర్మనీ - భారత్ మధ్య బంధాలు మరింత బలోపేతమయ్యే శకునాలు బలంగా కనిపిస్తున్నాయి.ముఖ్యంగా

విద్య,ఉద్యోగాలలో మనవారికి మంచి అవకాశాలు ఆ దేశం నుంచి లభించనున్నాయి.ఈ దిశగా ఇరుదేశాల మధ్య కీలకమైన ఒప్పందాలు జరుగనున్నాయి.

జర్మనీ విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి అన్నా లేనా బేర్ బాక్

రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ చేరుకున్నారు.మన దేశంపై ప్రశంసల జల్లులు కురిపించారు.

భారతదేశ భావి ప్రగతిపై అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారు.భవిష్యత్తులో ప్రపంచంలో భారత్ పాత్ర చాలా ప్రముఖంగా ఉండబోతుందని జోస్యం చెప్పారు.రెండు దేశాల మధ్య 'ద్వైపాక్షిక మొబిలిటీ అగ్రిమెంట్' పై ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయని ఆమె వెల్లడించారు. ఈ ఒప్పందం వల్ల జర్మనీ -భారత్ ప్రజల రాకపోకలు మరింత సులువు కానున్నాయి.మరో ఏడాది కాలంలోనే చైనా జనాభాను భారత్ మించబోతోంది.పెద్ద మార్కెట్ కేంద్రంగా మన దేశానికి పెద్ద గుర్తింపు ఉంది.ముఖ్యంగా మానవవనరులు,సహజవనరులు మన దగ్గర పుష్కలంగా ఉన్నాయి.

ఈ విషయాలు అభివృద్ధి చెందిన దేశాలన్నింటికీ ఇంతకు ముందే తెలుసు.ఇప్పుడు మరింత తెలుసు కుంటున్నాయి.యూజీసీ నిర్మిస్తున్న మన నూతన విద్యా విధానం పట్ల కూడా పలు దేశాలు ఆకర్షణకు గురవుతున్నాయి. ఇచ్చిపుచ్చుకొనే ధోరణులను ప్రతిబింబించే మన తీరు వారికి ఎంతో నచ్చుతోంది.

ఆ దేశాల జాబితాలో జర్మనీ కూడా ఉంది.దీనికి తోడు గత 15 ఏళ్ళలో మన దేశంలో జరిగిన అభివృద్ధి, పేదరిక నిర్మూలనలో సాధించిన ప్రగతి కూడా జర్మనీని ఆకట్టుకుంది.

జీ -20 లో భారత్ కొత్తగా చేపట్టిన నాయకత్వంపై కూడా జర్మనీ విశ్వాసాన్ని పెంచుకుంది.

ఉక్రెయిన్ - రష్యా యుద్ధం అంశంలో భారత్ చూపించిన వైఖరికి జర్మనీ ఫిదా అయ్యింది.ఇండో - పసిఫిక్ ప్రాంతంలో 21వ శతాబ్దంలో అంతర్జాతీయ విధానాలపై భారత్ ముద్ర విలక్షణంగా ఉంటుందని జర్మనీ విదేశాంగ శాఖా మంత్రి అన్నా లేనా నమ్మకాన్ని వెలిబుచ్చుతున్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ను జర్మనీ చూస్తోంది.

బలమైన ప్రజాస్వామ్య మూలాలు, సాంస్కృతిక సమైక్యత, భిన్న మతాలు, సామాజిక వర్గాల మధ్య విలసిల్లుతున్న శాంతి, సోషల్ ఇంజనీరింగ్ మొదలైనవి భారత్ పట్ల జర్మనీకి గౌరవాన్ని పెంచుతున్నాయి.

జీ 7-సదస్సులో భాగంగా మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జర్మనీకి వెళ్లినప్పుడు ఆ దేశం నుంచి అపూర్వమైన స్వాగతం లభించింది.

ఇప్పుడు ఆ దేశ విదేశాంగ మంత్రికి కూడా మన దేశంలో గొప్ప ఆత్మీయత ధ్వనించింది.

కమ్ముకొస్తున్న ఆర్థిక మాంద్యం మధ్య ఇబ్బందులను ఎదుర్కొంటున్న దేశాల జాబితాలో జర్మనీ కూడా ప్రముఖంగా ఉంది.

ఐరోపాలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జర్మనీ వేళ్లూనుకొని వుంది.రష్యా -ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం ఈ దేశంపైన కూడా బలంగా వుంది.ఈ నేపథ్యంలో భారత్ తో జర్మనీకి ఎన్నో అవసరాలు ఉన్నాయి.అందుకే మనతో చెలిమిని పెంచుకుంటోంది.

మన రెండు దేశాల మధ్య మొదటి నుంచి కూడా బలమైన సంబంధాలు ఉన్నాయి. వాణిజ్యం, సాంస్కృతికం, సాంకేతికం ఈ మూడు రంగాల్లో ఉభయులకు సహకారం అవసరమైన నేపథ్యమే ఉంది.

'యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ ' లో శాశ్వత సభ్యత్వాన్ని రెండు దేశాలు కోరుకుంటున్నాయి.

రక్షణ రంగంనూ ఇరు దేశాల మధ్య సఖ్యత ఉంది. భాషల పరంగానూ రెండు దేశాల మధ్య ఒప్పందం గతంలోనే ఏర్పడింది.

మన కేంద్రీయ విద్యాలయాలలో జర్మనీ,అక్కడ విద్యాలయాల్లో మన సంస్కృతం బోధన,అధ్యాయనాలు జరుగుతున్నాయి.

జర్మనీ పండితులు ఎక్కువమంది మన సంస్కృతాన్ని నేర్చుకోవడమే కాక, మన వేదాలను కూడా ఉపాసిస్తున్నారు. కొంతమంది జర్మన్లు అచ్చమైన భారతీయుల్లా అకృతి దాల్చుకున్న దృశ్యాలు మనకు తరచూ కనిపిస్తూ ఉంటాయి.మన కట్టూబొట్టు పట్ల వారు మోజు పెంచుకుంటున్నారు. మొత్తంగా జర్మనీ - ఇండియా మధ్య బలమైన,స్ఫూర్తి దాయకమైన ప్రయాణం జరుగుగాక.

# ఎఆర్ గ్రౌండ్స్‌లో ఘనంగా హోంగార్డ్డు ఆవిర్భావ దినోత్సవం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 60వ హెూంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవము 2022 ను నగర కమిషనర్ సి.హెచ్ శ్రీకాంత్, IPS., అదేశాలతో నగర ఏ.ఆర్ గ్రౌండ్స్ నందు ఘనముగా నిర్వహించారు.

ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిధిగా డిసిపి (క్రైమ్స్) జి. నాగన్న విచ్చేసి, హెూమ్ గార్డుల పతకావిష్కరణ చేసి, హెూమ్ గార్డుల గౌరవ వందనం స్వీకరించి,అనంతరం వాహనంపై ప్లటూన్లను తనిఖీ చేశారు.

అనంతరం డిసిపి (క్రైమ్స్) జి. నాగన్న మాట్లాడుతూ హెూమ్ గార్డ్స్ ఆర్గనైజేషన్ -1963లో స్వచ్ఛంద సంస్థగా మరియు అత్యవసర సమయంలో పోలీస్ డిపార్ట్మెంట్‌కు మద్దతుగా సహాయక దళంగా ఏర్పడింది. హెూంగార్డ్ ఆర్గనైజేషన్, విశాఖపట్నం సిటీలో మొత్తం 1058 మంది హెూంగార్డులు ఉన్నారు. 1058 మంది హెూంగార్డులలో 875 మంది హెూంగార్డులు జనరల్ డ్యూటీలు అంటే L&O, ట్రాఫిక్, క్రైమ్స్, సబ్ కంట్రోల్స్, బీచ్ BBలు, MTO, CPO, CAR మొదలైన వాటిలో పని చేస్తున్నారు. 183 మంది హెూంగార్డులు డిప్యూటేషన్ యూనిట్లలో అంటే స్టీల్ ప్లాంట్, గంగవరం పోర్ట్, సింహాచలం దేవస్థానం, టిటిడి, నేవల్ బేస్, ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, కోస్టల్ సెక్యూరిటీ (మెరైన్), సిబిసిఐడి, ఎసిబి, విజిలెన్స్, ఉమెన్ & చైల్డ్ వెల్ఫేర్, సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, కోరమండల్ మొదలైనవి.

హెూంగార్డుల డ్యూటీ అలవెన్సులను కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

70వ దశకంలో రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు. తీరిక సమయాల్లో హెూంగార్డులుగా సేవలందించారు. ప్రస్తుతం యువత నిరుద్యోగం మరియు పోలీస్ రిక్రూట్‌మెంట్ సమయంలో 8 సంవత్సరాల వరకు వయస్సు సడలింపు, సివిల్‌లో 15% కోటా, APSPలో 25% వంటి ప్రయోజనాల కారణంగా హెూంగార్డ్స్ ఆర్గనైజేషన్‌లో చేరడానికి ఎక్కువ ఆసక్తిని చూపుతున్నారు.

ఇటీవల హెచ్‌జిల సంక్షేమ చర్యలు కూడా చేపట్టబడ్డాయి అంటే డా.వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ, పిఎం జీవన్ జ్యోతి భీమా యోజన, పిఎం సురక్ష భీమా యోజన పథకం, కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం (రూ. 5,000/-), మెరిట్ స్కాలర్‌షిప్ (రూ. 2000/-), మెడికల్ రీయింబర్స్‌మెంట్ (రూ. 10,000/-) మరియు మరణించిన హెచ్‌జి కుటుంబ సభ్యులకు రూ. 5,00,000/- ఎక్స్‌గ్రేషియా మరియు హెూంగార్డ్స్ ఒక రోజు సహకారం కూడా రిటైర్డ్ హెూంగార్డులకు మరియు మరణించిన హెూంగార్డులకు ఆర్థిక సహాయంగా మంజూరు చేయబడుతుంది. గార్డ్స్ కుటుంబ సభ్యులు. మరణ కేసుల విషయంలో అంత్యక్రియలకు రూ. 10,000/-, కేంద్ర సంక్షేమ నిధి రూ. 15,000/- మరియు ఫ్లాగ్ ఫండ్ రూ. 10,000/- మరణించిన హెూంగార్డు కుటుంబ సభ్యులకు మంజూరు చేయబడుతోంది.

విశాఖపట్నం నగరంలో పనిచేయుచున్న40% మంది హెూంగార్డులు గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మరియు డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, డీజిల్ మెకానిక్స్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్లు, ప్లంబర్లు, కుక్స్ మరియు గార్డనర్ మొదలైన సాంకేతిక అర్హతలు కలిగి ఉన్నారు.

ప్రస్తుతం హెూంగార్డులకు రోజుకు రూ.710/- విధి భత్యం మరియు పరేడ్ అలవెన్స్ రూ.14/ - (ఒక్క పరేడ్ కు) మరియు రూ.25/- వాషింగ్ అలవెన్సులు ఇవ్వబడుతున్నాయి. మరియు ప్రతి సంవత్సరము యునిఫారం అలవెన్సు రూ. 1500/- (సంవత్సరానికి) ఇవ్వబడుతున్నాయి.

విశాఖపట్నం సిటీలోని పోలీస్ కమిషనరేట్‌లోని అన్ని శాఖల్లో (లా & ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, డ్రైవర్స్, సిటీ పోలీస్ ఆఫీస్, సిటీ ఆర్మ్ డ్ రిజర్వు మొదలుగునవి) పోలీస్ కానిస్టేబుళ్లతో పాటు హెూంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వారు ముఖ్యమైన బందోబస్తు విధులు అంటే VVIP/VIP విధులు, పండుగ విధులు, ముఖ్యమైన సంఘటనలు, ఎన్నికలు & ప్రకృతి వైపరీత్యాలు మొదలైన వాటికి కూడా హాజరవుతున్నారు. ప్రోత్సాహానికి కొలమానంగా నేరాలను గుర్తించడంలో వారి మంచి పనికి గాను హెూంగార్డులకు రివార్డ్ అందించడం జరుగుతుంది. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ వారి ద్వారా హెూంగార్డుల యొక్క అడ పిల్లల వివాహాల కోసం, హెూంగార్డుల పిల్లలకు ఉన్నత చదువులు చదివేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను కూడా మంజూరు చేస్తున్నారు.

ఈ కార్యక్రమం నందు CID నందు డ్రైవర్ గా పనిచేస్తున్న కొండల రావు కరాటే, బాడీ బిల్డింగ్ నందు తన ప్రతిభని ప్రదర్శనలో చూపారు, అనంతరం ఇటీవల రిటైర్మెంట్ తీసుకున్న హెూంగార్డును కుటుంబ సమేతముగా సత్కరించారు.

ఈ కార్యక్రమం నందు డి.సి.పి-2(L&O) కే.ఆనంద రెడ్డి, ఎ.డి.సి.పి(అడ్మిన్) ఎం.ఆర్.కే.రాజు, ఎ.డి.సి.పి(ట్రాఫిక్) అరిఫుల్లా , ఎ.డి.సి.పి(ఎ.ఆర్) కే.సుబ్రహ్మణ్యం , ఏ.ఆర్ ఏ.సి.పి ఆర్. శాంతి కుమార్ ,హెూం గార్డ్ ఆర్.ఐ శ్రీ టి.భగవాన్ ఇతర ఆర్.ఐ లు ఇతర అధికారులూ,హెూం గార్డులు, కార్యక్రమ వ్యాఖ్యత గా హెడ్ కానిస్టేబుల్ బీశెట్టి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# పేదలు అందరు ఇల్లు కట్టుటకు అనుమతి ఇవ్వండి



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** రాజయ్యపేట గ్రామంలో ఇళ్ళు పట్టాలు ఇప్పించాలని కోరుతూ ఈరోజు నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం కి విచ్చేసిన అనకాపల్లి జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి కి CPM పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు,రాజయ్య పేట గ్రామం 10 వ వార్డు మెంబర్ మైలపల్లి మహేష్ బాబు,విద్యా కమిటీ చైర్మన్ బొందలపు అప్పలరాజు, DYFI మండల కార్యదర్శి మైలపల్లి జాన్, SFI మండల నాయకులు మైలపల్లి బాపూజీ,పిక్కి వెంకటేష్ లు కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజయ్య పేట గ్రామంలో జగనన్న ఇళ్ళు మంజూరు అయిన లబ్ధి దారులు ఇళ్ళు నిర్మించుకోవాలంటే హౌసింగ్ అధికారులు ఇళ్ళు పట్టాలు కావాలంటున్నారని, రెవెన్యూ అధికారులను ఇళ్ళు పట్టాలు ఇవ్వాలని అడిగితే అది ఫారెస్ట్ భూములు కాబట్టి ఇళ్ళు పట్టాలు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారని తెలిపారు దీని కారణంగా పేదలు ఇళ్ళు నిర్మించుకోవడం సాధ్యం కాక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు, గ్రామం మొత్తం ఈ విధంగానే ఉందని తెలిపారు,గత ప్రభుత్వాలు హయాంలో 500 మందికి పైగా ఇళ్ళు పట్టాలు ఇచ్చి, ఇళ్ళు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు ఇవ్వకపోతే ఎలా అని పేదలు ఆవేదన చెందుతున్నారని నాయకులు తెలిపారు, దీని పై స్పందించిన జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పరవాడలో జరిగే మహాసభలు జయప్రదం చేయండి




**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మండల కేంద్రమైన పరవాడలో జరిగే సిఐటియు మహాసభలు ఈనెల 18,19 తేదీల్లో జయప్రదం చేయాలని మంగళవారం ఫార్మాసిటీలోని ప్రదర్శన నిర్వహించి మహాసభ జయప్రదానికే కార్మిక వర్గం అందరు కూడా హాజరు కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు.. సిఐటియు జిల్లా 12వ మహాసభలు మొట్టమొదటిసారి పరవాడలో జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉండే ఉద్యోగ, కార్మిక సమస్యల పై సమర శంఖాన్ని పూరించడం కోసం దోహద పడతాయని అన్నారు. ఈనెల 18వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు పరవాడ ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్ నుంచి సంతబయలు వరకు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ బహిరంగ సభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింహ రావు, రాష్ట్ర కార్యదర్శి కే స్వరూప రాణి జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై ప్రసంగిస్తారన్నారు. అనంతరం రెండు రోజులు పాటు పరవాడ సీతారామ కళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుందని ఈ మహాసభను జయప్రదం చేయడానికి కార్మికులందరూ కదిలి రావాలని అన్నారు. ఫార్మాసిటీలో కార్మిక చట్టాలు, ఉద్యోగ భద్రత , కనీస వేతనాలు తదితర సమస్యలపై సిఐటియు ఎనలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. స్కీం వర్కర్లు అసంఘటితరంగ కార్మికులైన ఆటో ,ముఠా, బిల్డింగ్ తదితర కార్మికుల హక్కులకై పోరాటాలు నిర్వహిస్తున్నారు. ఎన్ టిపిసి లో కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వసతులు, కనీస వేతనాలపై నిత్యం సిఐటియు కృషి చేస్తుందన్నారు.

# ఘనంగా వైభవ్ బుజ్జి జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణం లోని జార్జ్ క్లబ్ లో సంస్థ సభ్యులు వైభవ్ రెడీ మెడ్స్ అధినేత దాడి బుజ్జి జన్మదిన వేడుకలు క్లబ్ అధ్యక్షులు బుద్ద కాశి మాస్టర్,క్లబ్ సభ్యుల సమక్షం లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముందుగా కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు.అనంతరం కాశీ మాస్టర్,జిమ్ కోచ్ ఏమ్. ఎన్ ఎస్ అప్పారావు తదితరులు మాట్లాడుతూ అందరిలో కలసి పోయి ప్రతి కార్యక్రమాన్ని తానే అన్ని అయ్యి చేయడం బుజ్జి నైజం అన్నారు. అందరినీ కలుపుకుని పోయి అందరివాడు గా బుజ్జి వుంటాడని తెలిపారు . ఈ కార్యక్రమం లో క్లబ్ సభ్యులు ఆళ్ల రామకృష్ణ, పి విజయబాబు ,చవితిన నరసింగరావు, ప్రముఖ వైద్యులు డిడి నాయుడు, పిల్లల వైద్యులు డాక్టర్ కే.నవీన్,దాడి ఈశ్వర రావు,గ్రామీణ వైద్యులు ఆడారి శ్రీనివాస రావు,సీనియర్ పాత్రికేయులు మద్దాల కృష్ణ, ఆడారి సాంభశివరావు(దేవకీ), సబ్బరాజు,తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దత్తాత్రేయ జయంతి మహెూత్సవాలు

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో గవరపాలెం వేగి వీధిలో నున్న శ్రీ సంపత్ వినాయక శ్రీ సీతారామ షిరిడి సాయి సహిత సుబ్రహ్మణ్యేశ్వ స్వామి దేవస్థానంలో శ్రీ దాత్తాత్రేయ 24 వ వార్షిక ఉత్సవాలలో భాగంగా బుధవారం . శ్రీ దత్తాత్రేయ జయంతి మహెూత్సవం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన వైకాపా అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్ధ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్ ను ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన భారీ అన్న



సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 81 వ వార్డు కార్పొరేటర్ లక్ష్మి సౌజన్య రాంబాబు మాజీ కౌన్సిలర్ వేగి లక్ష్మి ,వేగి నాయుడు,పెంటకోట నందు, పెంటకోట పరమేశ్వరరావు ,వేగి సూరిబాబు , వేగి కృష్ణ,సూరిశెట్టి సన్యాసిరావు, పెంటకోట చెల్లయ్యమ్మ,వేగి దొరబాబు కోటిపల్లి శ్రీను కొణతాల పరదేశి నాయుడు, కర్రి వెంకట్రావు పాండు రేపాక ఇంద్ర కుమార్, నందారపు కుమార్ అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయిన 34 మంది మిలీసియ సభ్యులు

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** సీతారామరాజు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఎదుట లొంగి పోయిన 34 మిలిసియా సభ్యులు. ఒక మావోయిస్టు సభ్యురాలు. లొంగిపోయిన వారిలో మావోయిస్ట్ దళ సభ్యురాలు భారతి. పెదబయలు దళానికి చెందిన వీరి వద్ద నుండి డంప్ స్వాధీనం. దళ సభ్యురాలు భారతిపై లక్ష రూపాయలు ప్రభుత్వ రివార్డు ఉంద్దన్న ఎస్పీ. లొంగిపోయిన మిలిసియ సబ్యులకు పునరావాస చర్యలు చేపడతామన్న ఎస్పీ సతీష్ కుమార్.

## దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కంపార్ట్‌మెంట్ మరియు ప్లాట్‌ఫారమ్ మధ్య పడిపోయిన మహిళ క్షేమం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రయాణికుల ప్రాణాలను కాపాడినందుకు డిఆర్ఎం సహాయ బృందాన్ని మెచ్చుకున్నారు

దువ్వాడ రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్ నెం.4 వద్ద సుమారు 08.20 గంటలకు 17243 రాయగడ ప్యాసింజర్ రైలు నుండి డి-బోర్డింగ్ చేస్తున్నప్పుడు ఒక మహిళా ప్రయాణికురాలు కంపార్ట్‌మెంట్ మరియు ప్లాట్‌ఫారమ్ మధ్య పడిపోయింది. అన్నవరం నుంచి బయల్దేరిన మహిళ దువ్వ స్టేషన్‌లో దిగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

రైల్వే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్లాట్‌ఫారమ్‌ను బద్దలు కొట్టి ద్వారా ఆమెను క్షేమంగా బయటకు తీశారు.

ఆసుపత్రికి తరలించబడింది. సివిల్ ఇంజనీరింగ్, ఆపరేటింగ్, కమర్షియల్, ఆర్‌పిఎఫ్, రైల్వే మరియు జిఆర్‌పి సిబ్బంది చాలా గౌరవప్రదమైన పని చేశారు. గంటన్నర పాటు అవిశ్రాంతంగా శ్రమించి 9.35 గంటలకు ప్లాట్‌ఫాం నెం.4లోని 2 బ్లాకులను తొలగించి యువతి సురక్షితంగా బయటకు తీశారు. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు.

డివిజనల్ రైల్వే మేనేజర్ అనుప్ సత్పతి మహిళ ప్రాణాలను కాపాడేందుకు త్వరితగతిన రెస్క్యూ ఆపరేషన్ కోసం రక్షించడం అభినందనీయమన్నారు. ప్రశంసగా, టోకెన్ గ్రూప్ క్యాష్ అవార్డు మరియు వ్యక్తిగత అనులేఖనాలు ప్రకటించబడ్డాయి. సురక్షిత ప్రయాణాన్ని అనుసరించాలని మరియు రైలు ప్రయాణాలలో ప్రమాదకర కదలికలను నివారించాలని డిఆర్ఎం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాష్టంలో అభివృద్ధి చెందింది వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే : పీలా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అదేశాల మేరకు అనకాపల్లి పట్టణం,లోని 82వ వార్డులోని శ్రీరామ్ నగర్, మరిడి మాంబ ఆలయ ప్రాంతాలలో పార్టీ అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాధ్ ఆధ్వర్యంలో జరిగిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికిలి కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికార కన్వీనర్ మళ్ళ సురేంద్ర,కొణతాల రత్న కుమారి, పిట్ల రాజు, ఆకుల నానాజీ, పూడి త్రినాథ రావు, గుడాల సత్యనారాయణ, కోయిలాడ గణేష్, దొడ్డి శ్రీను, ఏర్రం శెట్టి వెంకట, ముప్పిడి మణికంఠ, రాజమంద్రి నారాయణరావు, బొమ్మల దేవీ, నరసింగ్రావు, పిట్లా హరీష్, మోహన్ కాంత్, పూడి చిన్నారావు, ఏళ్లపు వెంకట రమణ, భాను చంద్ర అఖిల్, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించాలి



**విజయనగరం:** బిఎల్ఓలు తప్పనిసరిగా ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, అర్హత ఉన్నవారందరికీ ఓటుహక్కు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఒక్క ఇంటిని కూడా ఒదలడానికి వీల్లేదని, శతశాతం సర్వే జరగాలని స్పష్టం చేశారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 219 మంది బూత్ లెవెల్ అధికారులకు, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల సవరణకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, యుద్ధప్రాతిపధికన సర్వే నిర్వహించాలని సూచించారు. 17 ఏళ్లు నిండిన వారివద్ద నుంచి కూడా ఓటు కోసం దరఖాస్తు స్వీకరించాలని, వారికి 18 ఏళ్లు నిండిన వెంటనే ఓటుహక్కు కల్పించబడుతుందని చెప్పారు. మరణించిన వారు, వలస వెళ్లి పోయినవారి పేర్లను తొలగించి, ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలన్నారు. ఓటర్ల నమోదులో బిఎల్ఓలదే కీలక పాత్ర అని, పౌరులకు ఎంతో అత్యున్నతమైన ఓటుహక్కును కల్పించే అధికారం వారికే ఉందని అన్నారు. సర్వే చేసినప్పుడు ఆధార్ కార్డు తీసుకొని, ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. బిఎల్ఓలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టాలని అన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, హాస్టళ్లు, వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి, ఆయా సంస్థల్లో ఉన్న ప్రతీఒక్కరి ఓటుహక్కు కల్పించాలని చెప్పారు. ఓటర్ రేషియో, జెండర్ రేషియోపై దృష్టి పెట్టాలన్నారు. ఎక్కడ ఉన్నవారికి అక్కడే ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తాశిల్దార్ బంగారాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫర్నీచర్ విక్రయానికి 23న బహిరంగ వేలం

**విజయనగరం:** వినియోగదారుల కమిషన్ కార్యాలయ పరిధిలో ఉన్న ఫర్నీచర్, కంప్యూటర్లు, ఫ్యాన్లు, కీ బోర్డులు, బ్యాటరీల విక్రయం నిమిత్తం ఈ నెల 23వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వినియోగదారుల కమిషన్ జిల్లా ప్రెసిడెంట్ ఆర్. వెంకట నాగసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిషన్ ఉత్తర్వుల మేరకు నిబంధనలను అనుసరించి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 3.00 గంటలకు జిల్లా కమిషన్ కార్యాలయ పరిధిలో బహిరంగ వేలం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# నైధన తార : మల్లాది సూరిబాబు

శ్రీ మల్లాది సూరిబాబుగారు మహా కవిపండితులు శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రెండవ కుమారులు.

తండ్రిగారి నుంచి వారసత్వంగా లభించిన సాహితీ సృజన వీరిని మంచి కథకునిగా తీర్చి దిద్దింది. వీరు సుమారు 70 కథలకు పైగా వ్రాశారు. చక్కటి తెలుగు నుడికారంతో, మధ్యతరగతి జీవితాలను హృద్యంగా తన కథలలో నింపుతారు. పాఠకుడిని పట్టి చదివించే రచనాశైలి వీరి ప్రత్యేకత.

'చివురంటి చిన్నది', 'వాసవసజ్జిక', 'శహన', 'మరణం ధృవమ్' మొదలైన గొప్ప కథలెన్నో సూరిబాబుగారు వ్రాశారు.

ఇప్పుడు పరిచయం చెయ్యబోయే నైధనతార అనే వారి కథ 2002లో 'రచన' మాస పత్రికలో ప్రచురింపబడింది.

"మా అమ్మగారు మీకు తాంబూలం ఇస్తారుట. ఈ పూట ఇంటికి తప్పక రమ్మన్నారు. రేపు ఆవిడ వూరికి వెడతారుట" అంటూ శారదాంబగారి నౌకరు నారాయణ సిద్ధాంతిగారి ఇంటికి వచ్చి చెప్పేడు.

నారాయణ సిద్ధాంతిగారు ఆ పరగణాలో ౦ ముహూర్తం, ప్రశ్న, జ్యోతిషం, వాస్తు శాస్త్రాలలో మేటి మొనగాడు. ఆ శాస్త్రాలలో ఆయనకి తెలియని విషయం లేదు అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఆయన సద్గురువుల వద్ద వేదవేదాంగాలు సక్రమంగా చదువుకున్నవాడు. పీఠాధిపతుల వద్ద మంత్ర దీక్ష పొందారు. వాక్ శుద్ధి గలవారిగా పేరు పొందారు.

ఆయన ఎందరి తల రాతలనో సరిదిద్దారు.

ఇన్ని పనులు చేసినా, పెద్దమ్మవారి (జ్యేష్ఠాదేవి) ముద్దుబిడ్డగా, సరస్వతీ వరప్రసాదుడుగానే మిగిలిపోయారు.

తన ఇల్లాలి సలహా మేరకు నిత్యం కనకధారా స్తవం, విష్ణు సహస్రనామం పారాయణ చేసినా, ఆయనకి రవ్వంత విరామం దొరికితే మాత్రం స్మరణ చేసేది ౦ బమ్మెర పోతనగారి 'భాగవతం' లోని... శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్ అనే మొదటి పద్యం!

ఆయన ముఖంలో వర్చస్సు పెరిగింది. కీర్తి నాలుగు దిక్కులా వ్యాపించింది. కానీ... అడుగు నేల మీదనే ఉంది.

"ఇంతమందికి ఇంతకాలంగా ఎంతో మేలు చేస్తున్నారు. ఎన్నో మంచి విషయాలు చెబుతున్నారు. మీరు ఏ మాత్రమూ ఎదుగూ బొదుగూ లేకుండా ఈ తీరుగానే ఉన్నారేం?" అని ఆయనతో పనిలేనివారు ప్రశ్నిస్తూ వుంటే ఆయన సమాధానం- మధురమైన మందహాసం!

తనలో తాను 'పూర్వ జన్మ సుకృతం!' అనుకునేవారు.

"ఇందరి జాతకాలు చూశారు కదా - మీ జాతకం ఎప్పుడైనా చూసుకున్నారా?" అని కావలసిన వారు అడిగితే,

"పెద్ద పెద్ద దైవజ్ఞులే చూశారు! చాలా గొప్ప యోగ జాతకం అన్నారు. బుధాదిత్య యోగం అన్నారు. గజ కేసరి యోగం వంటి మంచి యోగాలు ఉన్నాయన్నారు. కానీ - వీటన్నింటినీ కేమద్రుమ యోగం మింగేసిందని అన్నారు" అని చెప్పేరు.

"దానివల్ల ఏమి జరుగుతుంది?- నష్టమా?" కొందరి సందేహం.

"పెద్ద నష్టమేమీ లేదు. మనం అందరికీ ఉపయోగ పడతాం..కానీ ఇతరుల వలన మనకు ఉపయోగం ఉండదు."

"దీన్ని మార్చడానికి ఏదైనా అవకాశం కాని, శాంతి ప్రక్రియ కానీ ఉందా?"

"ఉన్నదల్లా ఒక్కటే ఉపాయం! ఈ జన్మలో పుణ్యం సంపాదించడం, వచ్చే జన్మలో ఆ పుణ్యఫలాన్ని అనుభవించడం."

"అంతేనా?" "అంతే!"

ఆ తరవాత ఆయన యోగక్షేమాల సంగతి ఎవరికీ పట్టలేదు! ఆ శ్రీ హరికి తప్ప!!

రెండు పుష్కరాలుగా ఆ దంపతులకు రెండు జతల బట్టలు, ఒక పూట భోజనం!

నెలకు పదిహేను ఏకాదశులు!! (పస్తులు).

దారిద్ర్యం ఉన్నా దీనత్వం లేని ఈ నిష్ఠాతులకు భగవంతుడు అడగకుండానే ఇచ్చిన వరయి ఆనందం!

అందరు ఇల్లాళ్ళలాగే ఆయన అర్ధాంగి సోమిదేవమ్మ కాపురానికి వచ్చిన తొలి సంవత్సరాలలో సంతానం కోసం ఎదురు చూసింది. కలగకపోయే సరికి పున్నామనరకం గురించి భయపడింది!

'పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు' అన్న వాక్యం గుర్తుకొచ్చి దాన ధర్మాలు చెయ్యాలని సంకల్పించింది. ఉబలాట పడింది.

అయితే, ధర్మంగా ఉండడం సాధ్యమైంది! దానమే- శక్తికి మించిన పనయింది! ఆమెకు అంతులేని దిగులు వేసింది. కాని ఆయన మాటలు విన్న తరువాత మనసుకు ఉపశమనం కలిగింది!

"దానం అంటే... ధనదానం, వస్తుదానం ఒక్కటే కాదు. ఆపదలో ఉన్నవారికి మంచి మాటలతో, మంచి చేతలతో మనం చేసే సహాయం కూడా దానమే!" అన్నారాయన.

ఆ నాటినుంచి ఆవిడ ఆ వాడలోవారికి పెద్ద దిక్కు అయ్యింది. తలలోని నాలుక అయ్యింది.

ఆ ప్రాంతానికి వారే పార్వతీ పరమేశ్వరులు అయ్యారు కానీ...కుబేరుడి స్నేహితులు కాలేకపోయారు!

అనాటికీ ఈనాటికీ ఆ లోగిలిలో ఉయ్యాల తొట్టె కట్టలేదు, పసిపిల్ల ఏడుపు వినిపించలేదు!

ఓనాడు సోమిదేవమ్మ ఆయనను, "నేను గొడ్రాలిని. మన వంశం నిలబడటం కోసమన్నా మీరు మళ్ళీ వివాహం చేసుకోండి" అని అమిత వేదనతో ప్రార్థించింది.

"శివ శివా!" అంటూ సిద్ధాంతిగారు చెవులు మూసుకున్నారు.

"సోమిదేవీ! హాస్యానికైనా ఎప్పుడూ ఇటువంటి మాటలు అనవద్దు" అంటూ మందలింపుగా అంటూంటే ఆయన మనస్సు, మాట గద్గదమయ్యాయి.

"ఏ వంశం ఎంతకాలం ఈ భూమిమీద ఉండాలో, అవి ఎవరి ద్వారా నిలబడాలో నిర్ణయించేది ఆ సర్వేశ్వరుడే! మానవుల లాగానే వంశాలూ పుడుతూ ఉంటాయి, గిడుతూ ఉంటాయి. అది సహజం. కాలం తీరిన వంశం కాలగర్భంలో కలిసిపోతుంది. దాని ఆయుర్దాయము పొడిగించడానికి మనం ప్రయత్నం చెయ్యడం అవివేకం!" అన్నారు.

ఆ విషయం గురించిన ప్రస్తావన ఆ ఇంట్లో మళ్లీ రాలేదు.

సుమారు పద్దెనిమిది మాసాల క్రితం తనని వెతుక్కుంటూ శారదాంబ వచ్చింది. ముఖంలో దైన్యం, భయం, ఆందోళన కనిపిస్తున్నాయి. నమస్కారం చేస్తూ తన ముందు నిలబడ్డది.

చేతిలో ఫలం, పుష్పం ఏమీ లేవు. ఆవిడ తన జాతకం కాగితాలు ఆయన చేతిలో పెడుతూ, "చాలా కష్టాలలో, ఇబ్బందులలో ఉన్నాను. ప్రాణ భయం వేస్తోంది. మీరు రక్షిస్తారని, ఈ ఆపద గట్టెక్కిస్తారని మీ శరణుకోరి వచ్చాను" అంటూ మోకరిల్లింది.

ఆయన ఆవిడను దీవిస్తూ, "అందరికీ శరణు ఇవ్వగలిగిన కరుణానిధి, శరణాగత వత్సలుడు - ఆ శ్రీమన్నారాయణుడే. వారిని ఆశ్రయించండి. అన్ని ఆపదలూ తొలగిపోతాయి. లక్ష్మీ కటాక్షం కలుగుతుంది." అన్నారు.

ఆవిడ మళ్లీ నమస్కరిస్తూ, "నాకు తెలిసిన లక్ష్మీనారాయణులు మీరే. మీరు ఏది చెయ్యమంటే అది చేస్తాను!" అంది.

సిద్ధాంతిగారు ఆ జాతకం క్షుణ్ణంగా పరిశీలించారు.

రవ్వంతసేపు అంతర్ముఖులయ్యారు.

ఆవిడ మనసులోని మాటలు ఆయనకు వినిపించాయి.

నీవే తప్ప ఇతఃపరం బెరుగ మన్నింపం దగున్ దీనునిన్....

ఆయన చిరునవ్వుగా ఆవిడ వంక చూశారు.

"మబ్బులు తొలగిపోతాయి. మళ్ళీ వెలుగు వస్తుంది. జీవితమంతా ఎప్పుడూ అమావాస్యగా ఉండదు. మీరు చేయవలసిన పనులు ఈ కాగితం మీద రాశాను. ఆ ప్రకారం చేయండి... సుఖం కలుగుతుంది" అన్నారు.

"ఏమేమి చెయ్యాలో చెప్పండి, తప్పక చేస్తాను" అందామె.

"ఈ మంగళవారంనాడు.. నూట ఎనిమిదిసార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేయండి. అనంతరం ప్రతినిత్యం ఉదయం ఋణ విమోచన అంగారక స్తోత్రం మూడుసార్లు పారాయణ చేయండి.

తరువాత మీ ఇంటి దగ్గర ఖాళీస్థలంలో నేను నిర్దేశించిన శుభ ముహూర్తాన శంకుస్థాపన చెయ్యండి. తరువాత గృహనిర్మాణం ప్రారంభించి, నేను నిర్ణయించిన ముహూర్తంలో గృహప్రవేశం చెయ్యండి - మూడు అంతస్తుల భవనం నిర్మించండి! సందేహించకండి. సాధ్యమా అని తర్కించకండి. మీ జాతకం అపూర్వ వస్తు లాభం సూచిస్తోంది. దానిని నిర్లక్ష్యం చేస్తే, ఆ ధనం రోగ నివారణకు... వ్యాధి రూపంగా వ్యయం అవుతుంది." అన్నారు.

ఆవిడ ఇంకొకసారి నమస్కారం చేసి వెళ్ళిపోయింది! అనాటికి ఈనాడు ఆవిడ కబురు వచ్చింది.

"శారదాంబగారింటికి వెళ్లొస్తాను" అంటూ సిద్ధాంతిగారు లేచారు.

సోమిదేవమ్మ ఒక్క క్షణం తటపటాయించింది.

"ఈనాడు మంగళవారం! నక్షత్రం మీకు నైధనతార!! రేపటి రోజున వెడితే బాగుంటుందేమో" అన్నది.

"రేపు ఆవిడ ఊరికి వెడతారుట. ఈ రోజే రమ్మని కబురు చేశారు. వెళ్ళొస్తే సరిపోతుంది" అన్నారు.

"ఆహ్వానం - ఉభయులకూనా? మీ వక్కరికేనా?"

"ఆ వార్తలో ఆ వివరాలు లేవు... పిలుపు నా వరకూ మాత్రమే ననిపించింది."

ఆవిడ చిరునవ్వు నవ్వి శుభ శకునంగా ఎదురు వచ్చింది.

"క్షేమంగా వెళ్ళి లాభంగా రండి!" అంది.

ఆయన కూడా స్మిత వదనంతో, "లాభం కంటే క్షేమం ముఖ్యం" అని శారదాంబగారి ఇంటివైపు నడిచారు.

తాను నిర్ణయించిన ముహూర్తానికే అర్భాటంగా శంకుస్థాపన చేశారనీ, అలాగే వైభవంగా గృహప్రవేశం కూడా జరిగిందనీ ఆయన కర్ణాకర్ణికగా విన్నారు.

తనకు పిలుపు లేదు, పేరంటమూ లేదు!

ఆ సంబరం ముగిసిన చాలా రోజులకు ఈనాడు ఈ ఆహ్వానం!

వెళ్లకపోతే... కబురు చేసినా రాలేదనే మాట మిగిలిపోతుంది.

ఆయన అన్యమనస్కంగానే వెళ్ళేరు.

ఎదురుగా వచ్చి ఎవ్వరూ స్వాగతం పలుకలేదు. రెండు ఘడియలు నిరీక్షణ అనంతరం ఆవిడ వచ్చింది. రావడమే...

"కబురు చేసిన యింత సేపటికా రావడం? శంకుస్థాపనకి, గృహప్రవేశానికి రాలేదేం? బొట్టూ కాటుక పెట్టి పిలవాలా? దగ్గరుండి చేయించవలసిన బాధ్యత మీకు లేదా??" అంటూ ప్రశ్నలతో ప్రళయంగా వచ్చింది.

ఆయన ముఖంలో చిరునవ్వు చెరగలేదు. చూపు ఆవిడను దాటి గోడ మీద ఉన్న తంజావూరు చిత్రపటం మీద నిలిచింది. మర్రిఆకు మీద పవళించిన బాలకృష్ణుడు!

ఆవిడ కూడా అటు చూసింది. ఆ చూపులో దర్పా ఉంది. గర్వముంది. ఆవిడ ఏదో చెప్పబోయింది.

"నేను ఇల్లు చూడవచ్చునా?" అని ఆయన అడిగారు.

ఆవిడ ఒక్క క్షణం తటపటాయించింది. చివరకు నౌకరును పిలిచి,

"దగ్గరుండి సిద్ధాంతిగారికి ఇల్లు చూపించు" అని ఆజ్ఞాపించింది.

సిద్ధాంతిగారు ఇల్లు చూసి వచ్చారు.

"ఎల్లా వుంది? అద్భుతంగా వుంది కదూ?" అని అడిగింది శారదాంబ.

"తూర్పు ఈశాన్యాలు రవ్వంత పల్లం చేయించండి. కుబేర స్థానానికి బలం చేకూరుతుంది" అన్నారాయన.

ఆవిడ ముఖంలో చికాకు కనిపించింది.

"ఇప్పుడు మార్పులు చేర్పులు చెయ్యడానికి కుదరదు" అంది.

ఆయన లేచి నిలబడ్డారు.

బహుశః అప్పుడు ఆవిడకు అసలు విషయం గుర్తుకొచ్చింది కాబోలు...

"మీకు తాంబూలం ఇవ్వాలి కదా... ఊరికే ఎవ్వరిచేతా పని చేయించుకోవడం నా కిష్టం ఉండదు. మీకేం కావాలో అడగండి ఇస్తాను" అంది.

సిద్ధాంతిగారి మనస్సుకు క్షణకాలం మాయ కమ్మింది! పరమాత్మ మీద నుండి మనస్సు పదార్థం మీదకు మరలింది. చూపు మళ్లీ ఆ వటపత్రశాయి చిత్రం మీద నిలిచింది.

ఆవిడ కూడా అటువంక చూసింది. హేళనగా ఎగతాళిగా నవ్వింది.

"సిద్ధాంతిగారూ! మీకు ఇంత అత్యాశ కూడదు. ఆ పెయింటింగ్ ఖరీదు ఎంతో తెలుసా? పదిహేను వేలు! మీ అంతస్తుకు, తాహతుకు తగినది అడగండి...ఇస్తాను" అంది.

'అడగండి...ఇస్తాను!' ఆయన మనస్సులో యీ మాటే పదేపదే మసలింది.

మాయ తొలగింది. వెలుగు వచ్చింది. వివేకం గుర్తు చేసింది.

'నువ్వు యాచకుడివి కావు! దైవజ్ఞుడివి!! ఇటువంటి ప్రలోభం, ప్రతిఫలాపేక్ష లేకుండా సమదృష్టితో, సమభావనతో ఫలితాలు చెప్పవలసినవాడివి.

ఆశలకు అతీతంగా దూరంగా ఉండవలసిన వాడివి. నీవు స్వీకరించవలసింది సంభావన! దానం కాదు!'

'ఎందుకు ఈ పొరబాటు జరిగింది?' అని మనస్సు ప్రశ్నించింది. నీ సాధన ఇంకా పూర్తికాలేదు. అందుకనే ఇటువంటి అగ్ని పరీక్షలు. దిగులు పడకు. 'ప్రమాదో ధీమతా మపి' అని అన్నారు. ఎంతటి వారికైనా యిటువంటి సమస్యలు తప్పవు' అంటూ హృదయం ఊరడించింది... చిన్నబోయిన మనస్సు చిరునవ్వు నవ్వింది. మల్లె కన్నా తేలికయ్యింది.

ఆవిడ చికాకుగా ఆయన వంక చూసింది.

"మీరు ఇంకా ఆ పెయింటింగ్ గురించే ఆశపడుతున్నారా? ఆ బొమ్మ సంగతి మరచిపొండి! అసలు విషయం గురించి ఆలోచించండి" అందామె.

బొమ్మను మరచిపొండి! అసలు విషయం గురించి ఆలోచించండి సిద్ధాంతిగారికి వినిపించింది.

అలవాటుగా ఆశీర్వదించడానికి అలవాటు పడ్డ చేతులు - అప్రయత్నంగా ఆవిడకి నమస్కరించాయి. క్షణం కాలు నిలవలేదు. ఏనుగెక్కినంత సంబరంతో యింటికి తిరిగి వచ్చాడు....ఉత్త చేతులతో!

కను సన్నలతోనే యిల్లాలు ప్రశ్నించింది - "క్షేమమా? లాభమా?"

"అది నువ్వే నిర్ణయించాలి. నా దృష్టిలో పెద్ద ప్రమాదం తప్పింది. గొప్ప గండం గడిచింది" అని ఆయన అనగానే ఆ యిల్లాలి మొహంలో ఆందోళన కనిపించింది.

"ఏం జరిగింది?" అని అడిగింది.

"తనది కాని దాని మీద మమకారం కలిగింది. ప్రతిబింబం- పదార్థమనే భ్రమ కలిగింది! అసలు విషయాన్ని గురించి ఆలోచించడం మానేశాను. నేను ఆలోచించవలసింది పరమాత్మను గురించి!..అది క్షణకాలం మరిచాను" అన్నారాయన.

"నాకు అర్థమయ్యేలా చెప్పండి" అందామె.

ఆయన జరిగిన విషయమంతా చెప్పారు. ఆ మాటలన్నీ విని ఆవిడ హాయిగా నవ్వింది.

"మీరు నిత్యం కొలిచే పర్వతరాజ నందిని ఆ శారదాంబగారి రూపంలో మీకు జ్ఞానోపదేశం చేసింది. మీ అంతరాళాల్లోని అజ్ఞానాన్ని ఒక్క మాటతో తొలగించింది. మీరు ఆశించిన దానికంటే ఎక్కువగానే సంభావించింది. ఆవిడకు మనం చాలా ఋణపడి ఉన్నాం" అందామె.

సిద్ధాంతిగారు పంచాంగం పరిశీలనగా చూశారు- ఎంతో సంతోషం వేసింది.

"సోమిదేవీ! నైధనతార వెళ్ళిపోయి మిత్రతార వచ్చింది" అని అన్నారు.

ఆయన మాట విని ఆ ఇల్లాలు నవ్వింది. ఇల్లంతా వెలుగుతో నిండిపోయింది.

అన్ని ముహూర్తాలకు ప్రధానంగా తారాబలం చూస్తారు. ఈ తారాబలం తొమ్మిది రకాలుగా విభజించారు.

అవి: 1) జన్మతార,2) సంపత్తార,3) విపత్తార,4) క్షేమతార,5) ప్రత్యక్తార,6) సాధనతార,7) నైధనతార, 8) మిత్రతార, 9) పరమ మిత్రతార.

వ్యక్తి యొక్క జన్మ నక్షత్రం నుండి ముహూర్తం నిర్ణయించవలసిన రోజున ఉన్న నక్షత్రం వరకూ లెక్కపెట్టి, వచ్చిన సంఖ్యను 9 చేత భాగించి, ఆ వచ్చిన శేషాన్ని బట్టి తారాబలం తెలుసుకుంటారు.

తప్పనిసరిగా చేయవలసిన పనులకు తారాబలం సరిపోకపోయినా, ప్రత్యామ్నాయాలు (దానాల వంటివి) సూచించారు పెద్దలు.

కానీ, నైధనతార అన్ని ముహూర్తాలయందూ విడిచిపెట్టాలని చెప్పారు.

(జన్మతార నుంచి 7, 16, 25 నక్షత్రాలు నైధనతారలు).

ఇక ఈ కథ విషయానికి వస్తే....

ఒక ఇంటింటి మాస పత్రికలో వచ్చిన ఈ కథలో రచయిత మల్లాది సూరిబాబుగారు ఎంతో లోతైన తత్వాన్ని, జ్యోతిషశాస్త్ర విషయాన్నీ ప్రబోధించారు.

ఈ కథకు నైధనతార అని అనే పేరు ఎందుకు పెట్టేరో, కథలో వటపత్రశాయి చిత్రాన్ని ఎందుకు తీసుకున్నారో అనే విషయాలను విశ్లేషించుకుంటే ఒక రచయితగా మల్లాది సూరిబాబుగారి భావాలు ఎంత పరిపక్వత చెందాయో, వారి పారమార్థిక చింతన ఎంతటిదో మనం అర్థం చేసుకోవచ్చు.

ఆయన మూడు పాత్రల ద్వారా లోతైన జీవిత సత్యాలని ఆవిష్కరించారు.

నారాయణ సిద్ధాంతిగారు వేద వేదాంగాలు పఠించిన వారు. మంత్రదీక్షాపరులు. ఎన్నో శాస్త్రాలలో మహా పండితులు. నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతూ, ఎవ్వరి దగ్గర్నుంచీ ఏమీ ఆశించని నిష్కామ కర్మ యోగి.

శారదాంబ మొదటిసారి ఆయన దగ్గరికి వచ్చి, ఆయనే దిక్కు అని వేడుకొన్నప్పుడూ.., ఆనక అన్నీ బాగున్నాకా ఆమె ఈయనను తన ఇంటికి తాంబూలానికి రమ్మని పిలిచి, ఆయనను ఒక సామాన్య యాచకుడిలాగ, యాయవారపు బ్రాహ్మణుని లాగ ఉద్దేశించి అవమానంగా మాట్లాడినప్పుడూ ఒకేలా చిరునవ్వుతో స్వీకరించారు. అంటే మానావమానాలకు ఆయన అతీతంగా ఉన్నారు.

నెలకు పదిహేను రోజులు పస్తులున్నా ఏనాడూ చేయిచాచి ఎవరినీ ఏమీ అడగలేదు.

అటువంటి నారాయణ సిద్ధాంతి శారదాంబగారింట్లో వటపత్రశాయి చిత్రపటాన్ని చూసి ముగ్ధులైపోయారు. భక్తి భావంలో తన్మయులై ఏమి అడగాలో తెలియని స్థితిలోకి జారిపోయి, ఆ బొమ్మ మీదే దృష్టి పెట్టారు. కానీ...ఎంతయినా అది కేవలం చిత్రమే కదా! అసలుకిప్రతిబింబమే కదా!! అసలు పదార్థాన్ని దర్శించాలంటేలో చూపు కావాలి. ఎందుకంటే బాహ్యంగా కనపడేది ఏదయినా నశించేదే! నశ్వరమైన దానిని తను ఆశించడమేమిటి?

ఈ భావాలని చెప్పడం కోసమే రచయిత వటపత్రశాయిని తీసుకున్నారు. వటపత్రశాయి వృత్తాంతము భాగవతంలో మార్కండేయ మహర్షి చరిత్రలోనూ, మహాభారతం అరణ్య పర్వములోనూ వస్తుంది.

వటపత్రశాయి అంటే మర్రి ఆకు మీద శయనించిన దేవుడు (విష్ణువు) అని అర్థం.

మార్కండేయుడు విష్ణువును గూర్చి తపస్సు చేసి, తనకు వరంగా ఆ దేవదేవుని మాయ చూడాలని ఉంది అని అడుగుతాడు.

ఆ తరవాత విపరీతమైన గాలులూ, ధారాపాతంగా వర్షమూ వచ్చి సముద్రాలు పొంగిపోతాయి. నీటితో సమస్తం మునిగిపోతుంది. మార్కండేయుడు మోహ శోకాలతో విష్ణుమాయతో నీటిమీద జీవించాడు. అలా తిరుగుతున్న ఆయనకు ఒక చోట మర్రి ఆకుపై శయనించిన బాలుడు కనిపించాడు. అతడే వటపత్రశాయి. ఆ వటపత్రశాయి ఉదరంలో మార్కండేయునికి నీట మునిగిన సమస్త భూమి, ప్రాణికోటి కనిపిస్తుంది.

అపుడు మార్కండేయునికి నారాయణుని గురించి సమస్తమూ అర్థమవుతుంది. బ్రహ్మాది దేవతలు, సూర్య చంద్రులు, ఈ సృష్టి సమస్తమూ శ్రీ మహావిష్ణువే అని అర్థమవుతుంది. ఆయనకు మాయ స్వరూపం బోధపడుతుంది.

అలా క్షణకాలం మాయలో పడిన సిద్ధాంతిగారు ఆ అద్భుత కళాస్వరూపంలో పరమాత్మ స్వరూపాన్ని దర్శించడానికి బదులు ఆ చిత్రాన్నే కోరుకున్నారు.

ఇక నిధనం అంటే మరణం. అందుకే నైధనతార ఉన్నప్పుడు ఏ ముహూర్తమూ పెట్టరు. ఈ కథలో నైధనతారలో నారాయణసిద్ధాంతి గారు శారదాంబ ఇంటికి వెళ్ళేరు.

అక్కడ ఆయనకు ఒక చిత్రం పట్ల కమ్మిన మోహమనే మాయ నిధనమైంది. అందుకే రచయిత నైధనతార అని కథకి పేరు పెట్టారు.

ఈ లోకంలో శారదాంబగారి లాంటి వాళ్ళను చాలామందిని చూస్తాము. కష్టాలలో ఉన్నప్పుడు ప్రాధేయపూర్వకంగా మాట్లాడతారు. అవి గట్టెక్కి ఒడ్డునపడ్డాకా గతం మరచిపోయి, అహంకారం నెత్తికెక్కించుకుంటారు.

రేవు దాటించే దాకా ఓడ మల్లన్న, రేవు దాటేకా బోడి మల్లన్న అనేవాళ్లంటే వీళ్ళే!

'తాంబూలం ఇస్తాను' అని కబురంపిన ఆమె తనకు తోచింది ఇచ్చి పంపించాలి కానీ, "ఏం కావాలో అడగండి ఇస్తాను" అనడమేమిటి? అదే అహంకారం అంటే!

సోమిదేవమ్మ మహా దొడ్డ ఇల్లాలు. తన భర్త పట్ల శారదాంబ అలా ప్రవర్తించినా, ఆయనలో జ్ఞానజ్యోతిని వెలిగించిన పార్వతీదేవి గానే భావించింది. అంతకు మించిన సంభావన ఏదీ లేదని ఆనందపడింది.

# సాయుధ దళాల సేవలు నిరుపమానం

**విజయనగరం:** సాయుధ దళాలు దేశానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కొనియాడారు. వారి త్యాగాలు అమోఘమని పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది. కలెక్టర్‌కు పతాక నిధి ఫ్లాగ్‌ను జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, సైనిక దళాల సేవలను కొనియాడారు. మంచు కొండల్లో, పర్వతాల్లో, ఎడారుల్లో, సముద్రంలో, ఎంతో ప్రతికూల వాతావరణం మధ్య, సాయుధ దళాలు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా, అనుక్షణం పహారా కాస్తూ, దేశాన్ని రక్షిస్తున్నాయని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే, మనమంతా దేశంలో ప్రశాంతంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల్లో, వైద్య విద్యార్థులను దేశానికి తిరిగి రప్పించేందుకు పడ్డ ప్రయాసను గుర్తు చేస్తూ, దేశంలోని పౌరులు అనుభవిస్తున్న స్వేచ్ఛ గొప్పదనాన్ని వివరించారు. సాహసోపేత వీరజవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చి, వారి త్యాగాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, గోడపత్రికలను కలెక్టర్ విడుదల చేశారు.

జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ, పతాక దినోత్సవ నిధికి ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు కూడా ఉదని తెలిపారు. సైనికుల సంక్షేమానికి పెద్ద ఎత్తున విరాళాలను అందించాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి, విజయనగరం ఎస్‌బిఐ ఖాతా నెంబరు 52065221666, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్0020931 కు గానీ, లేదా డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరుమీద చెక్కు లేదా డ్రాఫ్ట్ ద్వారా కూడా తమకు విరాళాలను అందజేయవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కెప్టెన్ ఎం.సత్యవేణి, కెప్టెన్ ఎ.కల్యాణ్ అహెూక్, లెఫ్టినెంట్ వి సన్యాసినాయుడు, హవల్దార్ మహబూబ్ కట్నాట్, మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు, పలువురు విశ్రాంత సైనిక యోధులు, ఎన్‌సిసి కేడెట్లు, సచివాలయ సిబ్బంది, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## నేటి చిట్టికథ

అనగనగా మంధర అనే నగరాన్ని విజయుడు అనే రాజు పాలిస్తూ ఉండేవారు. విజయుడు పాలనలో సమర్థుడే అయినప్పటికీ చాల అహంకారం కలవాడు. అతనికి ఆస్థానంలో కనక భట్టు అనే తెలివైన మంత్రి ఉండేవాడు. రాజు చాలా సందర్భాలలో నాలాంటి గొప్ప తెలివైన వాడు ఈ రాజ్యంలో ఎవరైనా ఉంటారా? అంటూ మంత్రి తో ఎగతాళిగా నవ్వేవాడు. మంత్రి రాజుగారిపై భయంతో అవును మహారాజ మన రాజ్యంలో మీకంటే తెలివైన వారు ఎవరూ లేరు అనే వాడు . కానీ ఇది మంత్రి కనక భట్టుకు నచ్చేది కాదు. ఎలాగైనా ఈ రాజు అహంకారాన్ని అణచాలని భావించాడు.

ఓ రోజు దర్బారులో మళ్లీ తన గురించి గొప్పలు చెప్పడం మొదలు పెట్టాడు రాజైన విజయుడు. ఆయన్ని ఎలాగైనా ఈ అలవాటు నుంచి బయటపడేలా చేసి రాజుగారి అహంకారాన్ని తొలగించాలని గట్టిగా భావించాడు కనక భట్టు.

కనక భట్మటు రాజుతో రాజుగారు ! మన సరిహద్దుల్లో ఉన్న గోపాలపురంలో చాలామంది తెలివైనవారు ఉన్నారు. మీరు ఆ ఊరి వారి కంటే తెలివైన వారిగా నిరూపించగలిగితే మీ గొప్పతనం మరింత మందికి తెలుస్తుంది కదా . వారెవరూ మీ తెలివికి సరితూగలేరు ' అన్నాడు మంత్రి.

దానికి విజయుడు గర్వానికి పోయి అలానా ! వెంటనే తేల్చుకుంటాను అని విజయుడు గోపాలపురం బయలుదేరాడు.

ఆ ఊరి పొలిమేరలో పశువుల కాపరి కనిపించాడు రాజుకి , రాజు అప్పుడు.. 'నా తెలివితో ముందు వీడిని ఓడిస్తా..' అనుకుంటూ అతడి దగ్గరికి వెళ్లాడు.

నేను మూడు ప్రశ్నలు అడుగుతా జవాబు చెబుతావా'అని అడిగాడు ఆ పశువుల కాపరిని. దానికి అతడు సరేనన్నాడు

1.ఈ సృష్టిలో అన్నిటికంటే వేగవంతమైనది ఏది? ' గాలి' చెప్పాడు పశువుల కాపరి.

2.అన్నింటికంటే ఉత్తమమైన జలం ? గంగాజలం అని జవాబు ఇచ్చాడు.

3.అన్నింటికంటే ఉత్తమమైన పాన్పు ఏది ? చందనపు కర్రతో చేసినది అని జవాబిచ్చాడు ఆ కాపరి.

దానికి విజయుడు. శభాష్ ! నా మనసులో కూడా ఇవే జవాబులు ఉన్నాయి ? నువ్వు నాలా చాలా తెలివైన వాడివే అని ఆ పశువుల కాపరితో అన్నాడు.

రాజుగారి మాటలకు ఆ పశువుల కాపరి 'హహ్హా హహ్హాహ్హా' అని పగలబడి నవ్వాడు. దానికి విజయుడు...... అతనివైపు ఆశ్చర్యం గా చూస్తూ.....ఏమైంది ? ఎంటా నవ్వు అని కాపరిపై కోపంతో అంటాడు.

అప్పుడు ఆ కాపరి..క్షమించండి రాజా ! నేను ఇంతకమునుపు మీతో తప్పుగా చెప్పిన జావాబుల్ని మీరు సరైనవి అంటే నాకు నవ్వొచ్చింది అని అంటాడు.

దానికి విజయుడు ...ఏంటి వీటికి సరైన జవాబులు వేరేవున్నాయా...!? అని అంటాడు రాజు .

దానికి ఆ కాపరి అవును మహారాజ అంటూ

1.ఈ సృష్టిలో అన్నిటికంటే వేగవంతమైనది ఏది?' మెదడు

'2.అన్నింటికంటే ఉత్తమమైన జలం ?- ' ఎడారుల్లో దొరికేది'

3.అన్నింటికంటే ఉత్తమమైన పాన్పు ఏది ? ' అమ్మఒడి ' అని జవాబు ఇచ్చాడు.

పశువుల కాపరి జవాబులతో బుద్ధి తెచ్చుకున్న విజయుడు మనసులో ఈ పశువుల కాపరే ఇంత తెలివైన వాడు అయితే ..ఆ గ్రామ ప్రజలు ఇంకెంత తెలివైన వారు అయింటారో అనుకొని పరాభవంతో బుద్ధి తెచుకొన్నావాడై తన రాజ్యానికి వెనుతిరిగాడు.

# జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** అంటరానితనం, షెడ్యూలు కులాలు, జాతుల వారిపై దాడులను నివారించుటకు జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం, అత్యాచారం, దాడులకు గురయిన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటుచేసిన కమిటీ సభ్యులు సేవాభావంతో పనిచేయాలని తెలిపారు. కేసులు నమోదులో జాప్యం ఉండకూడదని, కేసు నమోదుకు అవసరమైన ధృవపత్రాలు వెంటనే భాదితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. కేసు చార్జిషీటు ఉన్నతాధికారులకు వెంటనే పంపించాలన్నారు. డివిజనల్ స్థాయి సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు. భాధితులకు అత్యధిక పరిహారం అందించాలని, రెండు లేక అంతకంటే ఎక్కువ సెక్షన్ల ప్రకారం పరిహారం అందేఅవకాశం ఉంటే అందించాలని తెలిపారు. సరైన సెక్షన్ల ప్రకారం కేసునమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పరిహారం తో పాటు, కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన డా. అంబేద్కర్ సహాయ నిధినుండి కూడా పరిహారం అందించుటకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. నెలలో ఆఖరి వారంలో ఒకరోజు తహశీల్దార్లు ఒక గ్రామాన్ని సందర్శించి అంటరానితనంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలతో మాట్లాడి వారికి సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. పెండింగులో గల కేసుల వారీ వివరాలు, బాదితులకు అందించిన పరిహారం పై సమీక్షించారు. బాధితులు మైనర్లయితే బాలల సంక్షేమ కమిటీ వారిని పరామర్శించాలని, తరచు వారిని కలుసుకొని వారికి మనోధైర్యాన్ని కలిగించాలని తెలిపారు. అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు డా. ఒ. దిలీప్ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో నమోదైన కేసులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చార్జిషీటు కాపీలను కలెక్టరు కార్యాలయంనకు మరియు సంబంధిత అదికారులకు వెంటనే పంపించాలని తెలిపారు. రిపోర్టును పంపిన పిదప రశీదులను తీసుకొని రికార్డులలో పొందుపరచాలన్నారు. కుల దృవీకరణ సర్టిఫికెట్ నిర్ణీత ప్రొఫార్మా 3 ద్వారా తీసుకోవాలని తెలిపారు.



జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ మాట్లాడుతూ జి.ఒ. నంబరు 99 ప్రకారం జిల్లాలో జిల్లా కలెక్టరు అద్యక్షత జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఇరవై నాలుగు కేసులు నమోదైనాయని, పదహారు కేసులు విచారణ దశలోను, రెండు కేసులు కోర్టులో ట్రైల్ దశలోను ఉన్నాయని, ఆయ కేసులు సంబంధిత అదికారలకు విచారణ నిమిత్తం పంపించడం జరిగిందని తెలిపారు. బాధితులకు అందించిన పరిహారం వివరాలను తెలియజేసారు.

ఈ సమావేశంలో సబ్ కలెక్టరు నూరుల్ కమర్, ఆర్.డి.ఒ. కె.హేమలత, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, సబ్ డివిజినల్ పోలీసు అదికారులు ఎ. సుబాష్, జి.వి.కృష్ణారావు, మురళీధర్, సివిల్ సప్లయి జిల్లా మేనేజరు ఎం. దేవుల నాయక్, జిల్లా పశుసంవర్థక అధికారి ఎ. ఈశ్వరరావు, జిల్లా అగ్నిమాపకఅదికారి కె.శ్రీనుబాబు, కమిటీ సభ్యులు గునగంజి చంద్రయ్య, పిరపాక శ్రీనివాసరావు, మెయి లక్ష్మీకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందించాలి




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** మాజీ సైనికులు, దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల కుటుంబాల సంక్షేమం లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాలకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ బోర్డు చైర్పర్సన్ డా. కృతికా శుక్లా ప్రజలకు, వివిధ సంస్థలకు పిలుపునిచ్చారు. బుధవారం భారత సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్.. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి-2022ని ప్రారంభించి, తొలి విరాళం అందించారు. ఆన్లైన్లో విరాళాలు అందించేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ రక్షణకు అహర్నిశలు కృషిచేసిన సైనికుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబాలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ సైనికులు, అమరవీరుల కుటుంబాల పరిరక్షణ అందరి బాధ్యతన్న విషయాన్ని గుర్తుంచుకొని, పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. దాతలు నేరుగా జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించిగానీ లేదా Cheque /DD/Cash /Online Transfer చేయొచ్చని తెలిపారు. సైనిక సంక్షేమ నిధి అకౌంట్ వివరాలు: ZILLA SAINIK WELFARE OFFICER, STATE BANK OF INDIA, ZILLA PARISHAD BRANCH A/C No- 6 2 0 6 4 0 6 0 6 2 3, IFSC CODE-- SBIN0020974, MICR CODE- 533002028. ఈ విరాళాలకు ఆదాయపు పన్ను నుంచి సెక్షన్ 80G అనుగుణంగా మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికులు సి.ఆర్.సి.ప్రసాద్, ఎం.పి. రామారావు, సీహెచ్ పవన్ కుమార్ (పవన్ కంప్యూటర్స్, కాకినాడ) విరాళాలకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ పి.సత్య ప్రసాద్, జిల్లాలోని పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

# యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించండి



**విజయనగరం:** జీవనోపాధికి ఉద్యోగం ఒక్కటే మార్గం కాదని, స్వయం ఉపాధి రంగంలో అనేక మార్గాలు ఉన్నాయని.. వీటిపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. యువతను ప్రధానంగా స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలని సూచించారు. కేవలం ఉద్యోగాల కోసమే అందరూ ప్రయత్నిస్తే సంపూర్ణ స్థాయిలో అవకాశాలు రావని ఆమె అభిప్రాయపడ్డారు. వివిధ ప్రయివేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం తన ఛాంబర్లో ఆమె ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. యువత - ఉపాధి, ఓటు నమోదు, సామాజిక పరివర్తన తదితర అంశాలపై సమీక్షించారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ప్రధాన దశ అని ఇక్కడే వారిలో మానసిక పరివర్తన కలిగేలా శిక్షణ అందించాల్సి ఉందని పేర్కొన్నారు. వారిలో మానవతా విలువలను పెంపొందించాలని, పెద్దలంటే గౌరవం పెరిగేలా పరివర్తన తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., ఎన్.వై.కె. గ్రూపుల్లో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. 17 సంవత్సరాల వయసు వచ్చిన వారందరూ తప్పకుండా ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

**టెక్ బిలో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

12వ తరగతి ఎంపీసీ గ్రూపులో ఉత్తీర్ణులైన వారికి డిగ్రీతో పాటు ఉపాధి అందించేందుకు హెచ్.సి.ఎల్. సంస్థ ముందుకు వచ్చిందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ సూచించారు. టెక్ బి ప్రోగ్రాంలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పిస్తారని, ఇంటెర్న్ షిప్ కాలంలో రూ.10 వేలు స్టైఫండ్ కూడా అందజేస్తారని తెలిపారు. ఉద్యోగంతో పాటు బిట్స్ పిలానీ, శాస్త్ర, అమిటీ యూనివర్శిటీల నుంచి డిగ్రీ కూడా అందజేయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్నవారికి, త్వరగా ఉద్యోగం పొందాలనుకునే వారికి ఈ అవకాశం ప్రయోజకరంగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆర్.ఐ.వో. మజ్జి సత్యనారాయణ, వివిధ ప్రయివేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను పరిరక్షించుకుందాం రండి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** చెరువులను పరిరక్షించుకునేందుకు యువత, విద్యావంతులు, మేధావులు సామాజిక సేవ తత్పరులు ముందుకు రావాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి అన్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన పార్వతీపురం లోని నెల్లిచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వీకులు మనకు ఇచ్చినటువంటి అపూర్వమైన కానుకలు చెరువులన్నారు. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణ, సాగునీరు, తాగునీరు తదితర వనరులను కల్పించే చెరువులను నేటి సమాజంలో కొంతమంది అత్యాశ పరులు కబ్జాలకు గురి చేస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి కబ్జాకి గురైన చెరువుల వలన భావితరాలకు నీరు దొరకని పరిస్థితి ఎదురవుతుందన్నారు. వర్షాలు కురవక కరువు కాటకాలు సంబంధించే దుర్భర పరిస్థితులు నెలకొంటాయన్నారు. అటువంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని చెరువులను రక్షించేందుకు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఏర్పాటు అయింది అన్నారు ఇప్పటికే న్యాయస్థానాల ద్వారా, అధికారుల ద్వారా కబ్జాకు గురించి చెరువులను పరిరక్షించడం జరుగుతుందన్నారు . దీనిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో సమితి ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.కాబట్టి జిల్లాలో ఉన్నటువంటి విద్యావంతులు, మేధావులు సేవా తత్పరులు ముందుకు వచ్చి జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల్లో ప్రాతినిధ్య వహించాల్సిందిగా పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచెరువులు కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని రక్షించేందుకు తమ చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మరిచర్ల కార్తీక్ నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, పార్వతీపురం నియోజకవర్గం కన్వీనర్ గేదెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ళ నిర్మాణ సామగ్రి అందాల్సిందే



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఇళ్ల నిర్మాణానికి సామగ్రి లబ్ధిదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. కొమరాడలో నిర్మిస్తున్న జగనన్న ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బుధ వారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సిమెంట్, ఇసుక, ఐరన్ తదితర మెటీరియల్స్ అందజేస్తున్నారని, బ్యాంకులతో మాట్లాడి రుణం ఇప్పించారని, కరెంట్ సమస్య కొంత ఉందని దాని వలన నీటిని దూర ప్రాంతాల నుడి తీసుకొని రావలసి వస్తుందని, నిర్మాణ పనులలో కొంచెం జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు వివరించారు. మహిళా సంఘాలకు బ్యాంకులు సకాలంలో రుణాలు అందజేయాలని, బాధ్యత మీదే అని అధికారులను ఆదేశించారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, ప్రతి ఒక్కలబ్ధి దారుడు గ్రౌండింగ్ చేసి డిసెంబర్ నెలాఖరుకు నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయాలని అధికారులకు, లబ్ధిదారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. రఘురాం, గృహ నిర్మాణ, మండల అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలందేలా కృషిచేయాలని ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జిల్లా క్రమశిక్షణ కమిటీ (డీడీసీ) సమావేశం జరిగింది. డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం జిల్లాలో అమలుతీరు, అందుబాటులో ఉన్న ఆరోగ్య మిత్రలు, టీం లీడర్లు, అర్జీల స్వీకరణ, పరిష్కార వ్యవస్థ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, నెట్‌వర్క్ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించే వ్యవస్థలో ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో 84 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కింద ఆమోదం పొంది ఉన్నాయని, ఈ ఆసుపత్రుల్లో 79 మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య మిత్రలకు సంబంధించి ఖాళీలు ఏవైనా ఉంటే వెంటనే భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ చర్యల ద్వారా ఆరోగ్యశ్రీ సేవల వ్యవస్థను పటిష్టం చేయొచ్చన్నారు. ప్రతి నెల మొదటి బుధవారం డిస్ట్రిక్ డిసిప్లినరీ కమిటీ సమావేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలు ఫలప్రదంగా జరిగేందుకు వీలుగా నెలవారీగా సవివర నివేదికలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ స్థాయిలో ఏఎన్ఎం లకు ఆరోగ్యశ్రీ సేవలు, ప్రత్యేక యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనూ ప్రత్యేకంగా నోడల్ సిబ్బందిని నియమించాలని సూచించారు. డా. వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన సమాచారాన్ని పోస్టర్ల రూపంలో ప్రదర్శించాలన్నారు. 104, స్పందన, ఐవీఆర్ఎస్, వ్యక్తిగత మార్గాల ద్వారా అందే ఫిర్యాదులను, అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా గ్రీవెన్సుల పరిష్కారం ఉండాలని కలెక్టర్ కృతికాశుక్లా స్పష్టం చేశారు. సమావేశానికి డీఎంహెచ్‌వో డా. ఎం.శాంతిప్రభ, కమిటీ సభ్యులు డా. ఎస్.చక్రరావు, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డా. పి.రాధాకృష్ణ, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కె.నవీన్ తదితరులు హాజరయ్యారు.

# ఈ యోగాసనాలు ప్రాక్టిస్ చేస్తే.. మైగ్రేన్ మాయం అవుతుంది..!



మైగ్రేన్ తలనొప్పి.. ఈ బాధ అనుభవించే వారికే తెలుస్తుంది, ఇది ఎంత నరకంగా ఉంటుందో. మైగ్రేన్ తలనొప్పి వచ్చిందంటే ఆ బాధ భయంకరం. ఇది తలలో ఒకే వైపు నొప్పి వస్తుంది. ఒకసారి మైగ్రేన్ నొప్పి స్టార్ట్ అయితే.. 4 గంటల నుంచి 72 గంటల వరకూ కంటిన్యూ కావచ్చు. మైగ్రేన్‌లో కేవలం తలనొప్పే కాదు.. అలసట, కళ్లు తిరగటం, కళ్లు సరిగ్గా కనిపించకపోవటం, వికారం, వాంతితో పాటు వెలుతురు, చప్పుడు భరించలేకపోవటం వంటివి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. నాడీకణాలు ఎక్కువగా స్పందించడం వల్ల ఈ మైగ్రేన్ వచ్చే అవకాశం ఉంది. ఒత్తిడి, ఒంట్లో నీటిశాతం తగ్గటం, ఆల్కహాల్, పుల్లటి పండ్లు, ఛీజ్, నిద్రలేమి, ఎండ, వేడి, తేమ వాతావరణాలకు గురికావటం, పీరియడ్స్, లైట్ ఎక్కువగా ఉండటం, పొగ, పెద్ద శబ్దాలు, ఘాటన వాసనలు.. మైగ్రేన్‌ను ట్రిగ్గర్ చేస్తూ ఉంటాయి. మంచి ఆహారం, లైఫ్‌స్టైల్‌లో మార్పులు, ట్రిగ్గర్ చేసే అంశాలకు దూరంగా ఉంటే మైగ్రేన్‌ను నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మైగ్రేన్ సమస్యను తగ్గించడానికి యోగా ఎఫెక్టివ్‌గా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. న్యూరాలజీ జర్నల్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం, మైగ్రేన్‌తో బాధపడేవారు యోగా ప్రాక్టిస్ చేస్తే.. ఉపశమనం పొందవచ్చు.

**మత్స్యాసనం..** మత్స్యాసనం వేయడానికి ముందుగా.. వెల్లకిలా పడుకోవాలి. రెండు అరచేతులూ చెవుల పక్కన ఆనించి తలనీ, భుజాల్నీ నేల నుంచి కొంచెం పైకి లేపి తల పై భాగాన్ని మాత్రమే కింద ఆనించాలి. చేతులను తొడల మీద పెట్టుకోవాలి. అలా కాళ్ల మీద పెట్టడం కష్టమనిపిస్తే రెండు చేతులనూ కింద ఆనించి ఉంచవచ్చు. ఈ భంగిమలో ఎంతసేపు ఉండగలరో అంత సేపు ఉండి, చేతులను తీసి మళ్లీ భుజాలకూ చెవులకూ మధ్యన ఉంచాలి. మెల్లగా తలను యథాస్థితికి తీసుకురావాలి. ఇలా మూడుసార్లు చేయాలి.

**పద్మాసనం..** మొదట రెండు కాళ్లు.. చాపి నేలపై ఉంచాలి. తరువాత ఎడమ కాలును కుడి తొడపై, కుడి కాలును ఎడమ తొడపై ఉంచాలి. రెండు చేతులను మోకాళ్లపై నిటారుగా ఉంచాలి. చూపుడు వేలును బొటన వేలుకి నడుమ ఆనించి మిగతా మూడు వేళ్లను ముందుకు చాపి ఉంచి చిన్ముద్ర ధ్యాన స్థితికి చేరుకోవాలి. ఆ ఆసనం వేస్తున్న సమయంలో భ్రూమధ్య దృష్టిగాని, నాసాగ్ర దృష్టి గాని ఉండాలి. ధ్యానంలో ఉన్నప్పుడు హృదయస్థానంలో మనస్సును ఏకాగ్రం చేస్తే మంచి రిజల్ట్స్ వస్తాయి.

**బాలాసనం..** బాలాసనం ప్రాక్టిస్ చేస్తే.. మైగ్రేన్ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. బాలాసనం వేయడానికి ముందుగా.. బోర్లా పడుకుని కుడి మోకాలు, కుడి చేతిని పక్కకు మడిచిపెట్టాలి. ఎడమ కాలు, ఎడమ చేయి కిందికి తిన్నగా ఉంచేసి సేద పడుకోవాలి. నడుము నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు.. వెంటనే రెండు నిమిషాలు కుడివైపు, రెండు నిమిషాలు ఎడమవైపు ఈ పోజ్‌లో పడుకోండి.

**శవాసనం..** మ్యాట్‌పై కాళ్లు, చేతులు చాపి వెల్లకిలా పడుకోవాలి. శరీరాన్ని పూర్తి విశ్రాంత స్థితిలో ఉంచాలి. శ్వాస మీద దృష్టి పెట్టాలి. ఎలాంటి ఆలోచనలనూ మనసులోకి రానీయకుండా ఓ రెండు మూడు నిమిషాలు ఈ స్థితిలో ఉండండి. శవాసనం వేస్తే.. ప్రశాంతంగా నిద్రపడుతుంది. నిద్రలేమి కారణంగానూ.. మైగ్రేన్ సమస్య ట్రిగ్గర్ అయ్యే అవకాశం ఉంది.

**మార్జారాసనం..** మార్జాలం అంటే పిల్లి. ఈ ఆసనం వేయడానికి రెండు చేతులను గడ్డం కింద ఉంచుకుని బోర్లాపడుకుని విశ్రాంతి స్థితిలో ఉండాలి. రెండు అరచేతులను నేల మీద ఉంచి మోకాళ్ల మీద లేవాలి. ఈ స్థితిలో చేతులు నిటారుగా ఉండాలి. ఇప్పుడు శ్వాస తీసుకుంటూ వీపును కిందకు వంచి తలను పైకెత్తాలి. తర్వాత శ్వాస వదులుతూ వీపును పైకి లేపుతూ తలను కిందికి వంచి నాభిని చూడాలి. ఇలా రోజూ పదిసార్లు చేసిన తర్వాత బోర్లా పడుకుని విశ్రాంతి తీసుకోవాలి.

# మనం తాగే నీటిలో ఎన్ని రకాలున్నాయో తెలుసా?



బోర్ నీళ్లు, నల్లా నీళ్లు, ప్యూరిఫైడ్ వాటర్, మినరల్ వాటర్, బ్లాక్ వాటర్ ఒకటీ, రెండూ కాదు ఇలా చాలా రకాల నీళ్లు ఉన్నాయి. తాగే నీటిలో ఇన్ని రకాలు ఏమిటన్నది ఎప్పుడైనా ఆలోచించారా. అసలు నీళ్లు అంటే ఎలా ఉండాలి.. దానిలో ఏయే పోషకాలు, ఖనిజాలు, లవణాలు, మినరల్స్ ఉండాలి.. ఎలాంటి రంగులో ఉండాలి.

రెండు హైడ్రోజన్ అణువులు, ఒక ఆక్సిజన్ అణువు కలిస్తే ఒక నీటి అణువు ఏర్పడుతుంది. ఇలాంటి లక్షలాది అణువులు కలిస్తే ఒక నీటి బిందువు ఏర్పడుతుంది. ఇలాంటి నీటిని అందరం తాగుతాం. తాగే నీటి స్వచ్ఛతను పీహెచ్ విలువతో కొలుస్తాం. పీహెచ్ విలువ 6.5 నుండి 7.5 మధ్యలో ఉంటే ఆ నీటిని సాధారణ నీరు అంటారు. ఇలాంటి వాటిని తాగవచ్చు.

నదులు, చెరువులు, బావులు, బోర్ల నుండి వచ్చేది సాధారణ నీరు. ఈ నీటిని నిరభ్యంతరంగా తాగవచ్చు. అయితే వీటి నుండి వచ్చే నీరు కలుషితం కాలేదని నిర్ధారించుకోవాలి. నదులు, చెరువుల నీటిని క్లోరినేషన్, ఓజోనైజేషన్ చేసి తాగే నీటిగా మార్చిన తర్వాత ప్రభుత్వాలు కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తుంది.

ఇలా ఇంటింటికి సరఫరా అయిన నీటిని కొంత మంది రివర్స్ ఆస్మోసిస్ యంత్రాల్లో ఫిల్టర్ చేస్తారు. ఇలా నీటిని ఆర్వో చేయడం ద్వారా అందులోని మలినాలు పూర్తి స్థాయిలో తొలగిపోయి మరింత స్వచ్ఛమైన నీరుగా తయారవుతుంది. వీటిని ఆర్వో వాటర్ అంటారు. ప్యూరిఫైడ్ వాటర్ అని కూడా పిలుస్తుంటారు. ఇలాంటి ప్రక్రియల ద్వారా ఫిల్టర్ అయిన నీటిని బాటిళ్లలో ప్యాకేజ్ చేస్తే వాటినే ప్యాకేజ్డ్ వాటర్ అని అంటారు. ప్యూరిఫైడ్ వాటర్‌ను మరిగించి ఆవిరి రూపంలో నీటిని సేకరిస్తారు. ఇలా చేసే పద్ధతిలో లవణాలు, ఖనిజాలు, కర్బన పదార్థాలు ఏవీ ఉండవు. ఈ నీటినే డిస్టిల్డ్ వాటర్ అని పిలుస్తారు. ఈ డిస్టిల్డ్ వాటర్‌ను తాగడం వల్ల దాహం తీరుతుంది కానీ శరీరానికి ఎలాంటి మినరల్స్ అందవు. ఈ డిస్టిల్డ్ నీటిని ప్రయోగశాలలు, పరిశ్రమల్లోని యంత్రాలు, బ్యాటరీల్లో వాడతారు.

మినరల్ వాటర్ అంటే.. నీటిలో మినరల్స్ ఉంటేనే దాని వల్ల శరీరానికి ఉపయోగం. అందులో ఎలాంటి మినరల్స్ లేకపోతే ఎలాంటి ఉపయోగం ఉండదు. నదుల్లో, చెరువులు, బావులు, బోర్లలో లభించే నీటిలో సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి మినరల్స్ ఉంటాయి. అయితే ఇవి శరీరానికి ఎంత కావాలో అంత మొత్తంలో అందితేనే మంచిది. ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఆరోగ్య సమస్యలు వస్తాయి.

నీటిలో ఎన్ని మినరల్స్ ఉండాలి, ఎంత మొత్తంలో ఉండాలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నిర్దేశించింది. ప్యాకేజ్డ్ వాటర్ కొనేముందు ఆ బాటిల్ బీఐఎస్ నుండి అనుమతి పొందిందా లేదా చూసిన తర్వాతే కొనుగోలు చేయాలి.

టీడీఎస్ అంటే ఏంటంటే.. సాధారణ నీటిలో సోడియం, పొటాషియం, మెగ్నీషియం, సోడియం లాంటి మినరల్స్ ఉన్నట్లే.. కాడ్మియం, లెడ్, నికెల్ వంటి లోహాలు కరిగి ఉంటాయి. ఈ కరిగిన మూలకాల మొత్తాన్నే టోటల్ డిసాల్వ్ సాలిడ్స్(టీడీఎస్) అంటారు. ఈ టీడీఎస్ లెవెన్ 500mg/L కంటే మించి ఉండకూడదు.

బ్లాక్ వాటర్ అంటే ఏంటి? బ్లాక్ వాటర్ లేదా ఆల్కలీన్ వాటర్‌ను క్రికెటర్లు, సెలబ్రిటీలు వాడటం మనకు తెలిసిందే. సాధారణ నీటిలో పీహెచ్ వాల్యూ 7 వరకు ఉంటుంది. బ్లాక్ వాటర్ పీహెచ్ 8 నుండి 9 వరకు ఉంటుంది.

బ్లాక్ వాటర్‌ను శారీరక శ్రమ ఎక్కువగా ఉన్న వాళ్లు మాత్రమే తాగాలి. ఎలాంటి శారీరక శ్రమ లేని వాళ్లు తాగినే ఆరోగ్య సమస్యలు వస్తాయి. శరీరం యాక్టివ్‌గా లేకపోతే బ్లాక్ వాటర్ వల్ల క్షార లక్షణాలు శరీరంలో ఏర్పడి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయి. బ్లాక్ వాటర్‌ను అతిగా తాగడం కూడా మంచిది కాదని డైటీషియన్లు చెబుతున్నారు.

# మీకిష్టం లేకపోయినా ఎక్కువ తినేస్తున్నారా?

తినడం ఎవరికైనా ఇష్టమే. కొందరికి బిర్యానీ చూస్తే నోట్లో నీళ్లూరుతుంటాయి.. మరికొందరికి ఇంగువ వేసిన పులిహోరా తినాలని జిహ్వ తహతహలాడుతుంది. ఇలా అప్పుడప్పుడు కడుపు నిండుగా తినడం అత్యంత సాధారణం. అయితే తిన్న ప్రతీసారి కడుపు నిండుగా తినడం అనేది అతిగా తినే సమస్య కావొచ్చు. అంటే ఫుడ్ అడిక్షన్ కావొచ్చని వైద్య నిపుణులు అంటున్నారు.

చాలా మంది వారికి తెలియకుండానే ఎక్కువగా తినేస్తుంటారు. వారు భోజనం ముగించే వరకు అతిగా తింటున్నామన్న విషయం వారు గుర్తించలేరు. ఇలాంటి సమయంలోనే మైండ్‌ఫుల్‌నెస్ ఈటింగ్ సహేతుకంగా తినేందుకు సహాయపడతాయి.

మైండ్‌ఫుల్ ఈటింగ్ అంటే ఏంటి? తినేటప్పుడు పూర్తి శ్రద్ధ వహించడం. ఇంద్రియాలను నిగ్రహించుకుంటూ తక్కువ మొత్తంలో తినడం. భోజనాన్ని నెమ్మదిగా పూర్తిగా నమిలి తినడం. ఎంత తింటున్నారు, ఏం తింటున్నారు అనేది గమనిస్తూ తినడం వల్ల అతిగా తినడాన్ని నివారించవచ్చు. దీనినే మైండ్‌ఫుల్ ఈటింగ్ అంటారు. తినేటప్పుడు పరధ్యానంగా ఉండకూడదు. అంటే టీవీ చూస్తూనో, ఫోన్ వాడుతూనో, కంప్యూటర్ ఆపరేట్ చేస్తూనే తినడం వల్ల ఎంత తింటున్నాం అనేదానిపై ఒక అంచనా ఉండదు. భోజనాన్ని త్వరత్వరగా ముగించకూడదు. నెమ్మదిగా ఆహారాన్ని పూర్తిగా నములుతూ తినాలి. దీని వల్ల జీర్ణక్రియ సక్రమంగా ఉంటుంది. అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలు తలెత్తవు.



భోజనంలో ఫైబర్ ఉండేలా చూసుకోవాలి తినే ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండేలా చూసుకోవడం చాలా చాలా ముఖ్యం. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీని వల్ల మనకు తెలియకుండానే తక్కువ తింటాం. భోజనంలో తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటే వాటిలోని ఫైబర్ అందుతుంది. ఫైబర్ వల్ల కడుపు నిండినట్లుగానే కాకుండా జీర్ణవ్యవస్థ సక్రమంగా ఉంటుంది. మలబద్ధకం సమస్య తలెత్తదు.

భోజనం దాటవేయవద్దు బరువు తగ్గాలనో ఇంకేదైనా కారణంతోనో భోజనం తినకుండా ఉండొద్దు. దీని వల్ల ఆకలి ఎక్కువగా అవుతుంది. భోజనం తిన్నప్పుడు కడుపును పూర్తిగా నింపేయడానికి ప్రయత్నిస్తారు. భోజనం చేయకపోవడం తీవ్రమైనక ఆకలిని కలిగిస్తుంది.

హైడ్రేటెడ్‌గా ఉండాలి వేసవికాలం, శీతాకాలం, వర్షాకాలం, కాలంతో సంబంధం లేకుండా నీరు ఎక్కువగా తాగాలి. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల హైడ్రేటెడ్‌గా ఉండటంతో పాటు చర్మం కాంతివంతం అవుతుంది. తినడానికి కొంత సమయం ముందు ఒకటి లేదా రెండు గ్లాసుల నీరు తాగితే తక్కువగా తినడానికి సహాయపడుతుంది.

మరోసారి భోజనం వేసుకుంటున్నారా భోజనాన్ని ఒక్కసారి మాత్రమే వడ్డించుకోండి. కొద్దిగా ఆహారం వడ్డించుకుంటే దానితోనే సరిపెట్టండి. కావాలంటే గంటా రెండు గంటలు అయ్యాక మరోసారి ఆహారం తినడం అలవాటు చేసుకోండి.

మైండ్‌ఫుల్‌నెస్ వ్యాయామాలు: తినేటప్పుడు దృష్టిని కేంద్రీకరించడం వల్ల మైండ్‌ఫుల్‌నెస్ ద్వారా తినడాన్ని కంట్రోల్ చేయవచ్చు. శ్వాసపై దృష్టి: సరిగ్గా ఊపిరి పీల్చుకోవాలి. నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. శ్వాసపై దృష్టి పెడుతూ గాలి ఎలా లోపలికి వెళ్తుందో గమనించాలి. దీనిని సాధన చేయడం వల్ల మెదడు, గట్ మధ్య సమతుల్యత మెరుగుపడుతుంది. కండరాల సడలింపు: ప్రధాన కండరాల సమూహాన్ని బిగించి విడుదల చేస్తూ చేసే వ్యాయామమే మజిల్ రిలాక్సేషన్ అంటారు. కండరాల సంకోచాన్ని విడుదల చేస్తున్నప్పుడు, కండరాలు విశ్రాంతి తీసుకోవడానికి ఎలా అనిపిస్తుందో గమనించాలి.

**ఏకాగ్రతతో నడవడం:** ఆరు బయట, పార్కుల్లో, పొలాల గట్లపై ఏకాగ్రతతో నడవడం ప్రాక్టీస్ చేయండి. నాలుగు గోడల మధ్య ట్రేడ్‌మిల్‌పై నడవడం కంటే ఆరుబయట నడవడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

# డస్ట్ అలర్జీకి ఆయుర్వేదం

నేడు పట్టణాలనే కాదు, పల్లెల్లోనూ కాలుష్యం పెరిగింది. వాయు కాలుష్యంలోనూ ఎన్నో రకాలున్నాయి. అందులో దుమ్ము ఒకటి. సీజనల్ వారీగా ఈ కాలుష్యంతో పలు రకాల అలర్జీలు వస్తుంటాయి. ముఖ్యంగా శీతాకాలంలో దుమ్ము, ధూళి కాలుష్యం భూ ఉపరితలంపై మరీ ఎత్తుకు వెళ్లదు. దీంతో కాలుష్యం పెరిగి ఎన్నో సమస్యలు వస్తుంటాయి.



సాధారణంగా ఈ అలర్జీ కారకాలకు ముందుగా స్పందించేవి మన ముక్కు, గొంతు అని చెప్పుకోవాలి. ఇవి మన వ్యాధి నిరోధక రక్షణ వ్యవస్థలో ప్రాథమికంగా స్పందించే భాగాలు. అందుకే ముక్కు కారడం, తుమ్ములు, దగ్గు, కళ్లు ఎర్రబడడం, గొంతు మంట, నొప్పి కనిపిస్తాయి. ఈ సమస్యలకు ఆయుర్వేద వైద్యులు సహజసిద్ధ పరిష్కారాలు సూచిస్తున్నారు.

**పసుపు:** ఇది సహజసిద్ధమైన యాంటీ బయోటిక్. దగ్గును తగ్గించే శక్తి దీనికి ఉంది. అంతే కాదు, ఇన్ ఫ్లమేషన్, కళ్లెను సైతం తగ్గిస్తుంది. రాత్రి నిద్రకు ముందు గోరువెచ్చని పాలలో పసుపు వేసుకుని తాగాలి.

**తులసి:** తులసిలో యాంటీ మైక్రోబయల్ గుణాలు ఉన్నాయి. శ్వాస కోస సమస్యలకు తులసి మంచి ఔషధమని మన పెద్దలు కూడా సూచిస్తుంటారు. దగ్గు వస్తుంటే ఎండబెట్టిన తులసి ఆకుల పొడిని తేనెతో కలిపి తీసుకోవచ్చు. అప్పుడే కోసిన తులసి ఆకులను పుక్కిట పెట్టుకుని కొంచెం కొంచెం నమిలి రసం మింగడం వల్ల మంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నీటిలో కాచి తాగడం వల్ల కూడా ఫలితం ఉంటుంది.

**బ్లాక్ కుమిన్:** దీన్ని కలోంజీ అని అంటారు. దీనిలో యాంటీ మైక్రోబయల్ గుణాలు ఉంటాయి. ఇన్ఫెక్షన్, ఇన్ ఫ్లమేషన్ తగ్గించే ఔషధ గుణాలు కలోంజీకి ఉన్నాయి. నల్లగా, నువ్వుల మాదిరి ఇవి కనిపిస్తాయి. అలెర్జిక్ రైనైటిస్ సమస్యలో కలోంజీ నూనెను ముక్కుపై, గొంతుపై రాసుకోవడం వల్ల ఉశమనం ఉంటుంది.

**యోగ:** ప్రాణాయామంతో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుంది. దీనివల్ల అలెర్జీలపై పైచేయి సాధించొచ్చు. అర్ధ చంద్రాసన, పవన ముక్తాసన, వృక్షాసన, సేతు భద్రాసనాలు ఇందుకు పరిష్కారాలు.

# చలికాలంలో అందవిహీనమైన ముఖాన్ని ఇలా కాంతివంతం చేసుకోండి



అందంగా కనిపించాలని, మెరిసిపోవాలని ఏ అమ్మాయికి అయినా ఉంటుంది. అందుకే రకరకాల క్రీములు, లోషన్లు రాస్తుంటారు, పార్లర్లకు వెళ్లి ఫేషియల్స్ చేయించుకుంటారు. ముఖంపై చిన్న మొటిమ కనిపించినా విలవిల్లాడిపోతారు. ఆ మొటిమ పోయే వరకు తల్లడిల్లిపోతారు. కొందరైతే ముఖంపై మొటిమలు వస్తే ఇంటి నుండి బయటకు వచ్చేందుకు కూడా జంకుతారు. చలికాలం వచ్చిందంటే చర్మ సమస్యలు మరింత ఇబ్బంది పెడుతుంటాయి. ఇప్పటికే మొటిమలు ఇబ్బంది పెడుతుంటే చలికాలంలో చర్మం పొడిబారడం, పేలిపోవడం, కాంతిహీనంగా కనిపించడం వల్ల రకరకాల క్రీములు రాస్తూనే ఉంటారు.

ముఖంపై మొటిమలు పోవాలన్నా, చలికాలంలో అందవిహీనంగా మారిన చర్మాన్ని కాంతివంతంగా మార్చుకోవాలన్న వాటికి బొప్పాయి ఒక్కటే పరిష్కారం. ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చే బొప్పాయి.. అందానికీ ఎంతో మేలు చేస్తుంది.

బొప్పాయిని ఎలా వాడాలంటే.. కప్పు బొప్పాయి గుజ్జుకి పాలల్లో రాత్రంతా నానబెట్టిన ఓట్స్ కలపాలి. అందులో కొద్దిగా తేనె వేసి మెత్తగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖంపై ఫేస్ ప్యాక్ లా రాసుకోవాలి. ఇలా చేస్తే కాంతి కోల్పోయిన చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది.

పావు కప్పు బొప్పాయి గుజ్జుకు కోడి గుడ్డులోని తెల్లసొన కొద్దిగా కలపాలి. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం జోడించాలి. ఈ మిశ్రమాన్ని ఫేస్ పై రాసుకుని 15 నిమిషాలు అయ్యాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే మొటిమలు, నల్ల మచ్చలు తొలగిపోతాయి.

బొప్పాయి గుజ్జు లో రెండు టేబుల్ స్పూన్ల తులసి ఆకుల పొడి, కొద్దిగా తేనె కలిపి రోజూ ముఖానికి పెట్టుకోవాలి. 10 నిమిషాలు అయ్యాక చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే ముఖం కాంతివంతంగా అవుతుంది. చర్మ మృత కణాలు తొలగిపోతాయి.

బొప్పాయి గుజ్జులో కొద్దిగా నిమ్మరసం మిక్స్ చేసి ముఖం మొత్తం అప్లై చేయాలి. కొద్ది సేపు అలాగే ఉంచి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వల్ల చర్మం రంగు మారడం మాత్రమే కాదు, చర్మంలో మంచి కాంతి రూపుదిద్దుకొంటుంది. స్కిన్ టోన్ లైట్ చేసి, స్కార్ మార్క్స్ ను తగ్గిస్తుంది.

ఈ మాస్క్ స్కిన్ టోన్ మార్చుతుంది మరియు డార్క్ స్పాట్స్ తగ్గిస్తుంది . బొప్పాయి జ్యూస్ ను టమోటో జ్యూస్ తో మిక్స్ చేసి ముఖం మొత్తం అప్లై చేయాలి. అరగంట తర్వాత శుభ్రం చేయడం వల్ల గ్లోయింగ్ అండ్ క్లియర్ స్కిన్ పొందవచ్చు.

బొప్పాయి గుజ్జులో అవొకాడో పేస్ట్ చేర్చి ముఖానికి అప్లై చేయాలి. దీన్ని అప్లైచేయడంవల్ల చర్మానికి తగిన పోషణను అందిస్తుంది. చర్మం తేమగా ఉంటుంది. దాంతో చర్మం చూడటానికి మంచిగా ఉంటుంది . బొప్పాయి, అవొకాడోను మిక్స్ లో వేసి బ్లెడ్ చేసి, ఈ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసి కొద్ది సేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి.

# రూట్ వెజిటబుల్స్ రోజూ తీసుకుంటే ఆ వ్యాధి నుంచి ఉపశమనం ఖాయం

మీరు డయాబెటిక్ రోగి అయితే చలికాలంలో కాస్త జాగ్రత్త అవసరం. ముఖ్యంగా డైట్ విషయంలో కేర్ మరీ అవసరం. చలికాలంలో రూట్ వెజిటబుల్స్ డైట్‌లో చేర్చితే మీ బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది.



చలికాలం నడుస్తోంది. ఈ సమయంలో ఆరోగ్యపరంగా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రోగ నిరోధక శక్తి తగ్గడంతో వివిధ రకాల వ్యాధులు చుట్టుముడుతుంటాయి. అదే సమయంలో డయాబెటిస్ రోగులకు సమస్య మరింత పెరుగుతుంది. అందుకే ఈ కాలంలో డైట్‌పై శ్రద్ధ చాలా అవసరం. డయాబెటిస్ రోగులు తమ డైట్‌లో కొన్ని రకాల కూరగాయలు చేర్చాల్సి ఉంటుంది. దీనివల్ల బ్లడ్ షుగర్ నియంత్రణలో ఉంటుంది. ఇవి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం కూడా. ముఖ్యంగా రూట్ వెజిటబుల్స్ తప్పకుండా తీసుకోవాలి.

టర్నిప్ అద్భుతమైన కూరగాయల్లో ఒకటి. ఇందులో కార్బోహైడ్రేట్స్ చాలా తక్కువగా ఉంటాయి. దాంతోపాటు నీటి శాతం ఎక్కువ. ఫలితంగా బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉపయోగపడతాయి. కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

డయాబెటిస్ రోగులకు బీట్‌రూట్ మరో అద్భుతమైన పదార్థం. బీట్‌రూట్ తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయి. ఎందుకంటే ఇందులో బీటాలేన్, నియో బీటానిన్ పుష్కలంగా ఉంటాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో ఉంటాయి.

చలికాలంలో క్యారట్ చాలా పుష్కలంగా లభిస్తుంది. ఇందులో పోషక పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కూర, సలాడ్, జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు.

ముల్లంగిలో అద్భుతమైన పోషక గుణాలున్నాయి. ఫలితంగా బ్లడ్ షుగర్ నియంత్రణలో దోహదపడతాయి. డయాబెటిస్ నియంత్రణకు ప్రతిరోజూ ముల్లంగి తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి.

# పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణా కార్యక్రమం



బిక్కవోలు, (విశాఖ సమాచారమ్): బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం నందు బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక - 2023-24 పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగిందని బిక్కవోలు ఎంపీడీవో తెలియజేశారు.సోమవారం అన్ని గ్రామాల సర్పంచులకు, ఎంపిటిసిలకు, కార్యదర్శులకు, మండల అధికారులకు శిక్షణ జరుగగా, మంగళవారం తొస్సిపూడి, బలభద్రపురం, ఇళ్ళపల్లి, రంగాపురం, కాపవరం,కొమరిపాలెం, పందలపాక సచివాలయ సిబ్బంది కి శిక్షణ ఇచ్చినట్లు, అలాగే గురువారం మిగిలిన గ్రామాలు అనగా బిక్కవోలు, ఆర్ ఎస్ పేట, కొంకుదురు, ఆరికరేవుల, మెల్లూరు, ఊలపల్లి గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లుగా ఎంపీడీవో జె ఏ ఝాన్సీ, ఈవోపీఆర్డి జి భవాని, పూలపల్లి పంచాయతీ కార్యదర్శి కె రామకృష్ణ, పందలపాక-1 డిజిటల్ అసిస్టెంట్ ఎస్ సురేష్ కుమార్ ట్రైనర్లుగా వ్యవహరించినారు.

# అమ్మ దాసరి సంక్షేమ అసోసియేషన్ ద్వారా నిరుపేద వృద్ధులకు వితరణ




చింతపల్లి, (విశాఖ సమాచారమ్): శీతాకాలం కారణంగా ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రాంతంలో చలికి అల్లాడుతున్న నిరుపేద వృద్ధులకు, అభాగ్యులకు కొణిదల వెంకట్రావు ట్రస్ట్ అమ్మ దాసరి సంక్షేమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, బియ్యం, ప్లాస్టిక్ బకెట్లను వితరణగా అందజేసినట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షురాలు దాసరి లక్ష్మి సంధ్య అన్నారు. స్థానిక ఎంపీటీసీ రావుల నాగమణి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్ ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పంచాయతీలోని కొంతమంది వృద్ధులకు ఆమె దుప్పట్లు, బియ్యం, ప్లాస్టిక్ బకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్య ప్రాంతంలో నిరుపేద ప్రజలను ఆదుకునే క్రమంలో నెలకొల్పబడిన శ్రీ కొణిదల వెంకట్రావు ట్రస్ట్ నిర్వహిస్తున్న అమ్మ దాసరి సంక్షేమ అసోసియేషన్ ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించడం, అదే క్రమంలో శీతల వాతావరణంతో ఇబ్బంది పడుతున్న వృద్ధులను గుర్తించి అమ్మ అసోసియేషన్ ద్వారా దుప్పట్లు, బకెట్లు, బియ్యం తదితర సరుకులు వితరణగా అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రకృతి సహజసిద్ధంగా లభించే ఆర్గానిక్ ఆహారాన్ని తీసుకోవడం వలననే వృద్ధులు కూడా ఎంతో ఆరోగ్యవంతులుగా ఉన్నారని, ఇంతటి చలి తీవ్రత కలిగిన పర్యాటక ప్రాంతాన్ని అప్పుడప్పుడు పర్యాటకులు ఆస్వాదిస్తుండగా నిత్యం ఇదే ప్రాంతంలో జీవనం సాగిస్తూ ఏడాది పొడుగునా శీతల వాతావరణాన్ని, ప్రకృతి సహజసిద్ధంగా లభించే స్వచ్ఛమైన ప్రాణవాయువును పొందుతున్న ఈ ప్రాంతీయులు ధన్యులు అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వైకాపా నాయకుడు రావుల నూకరాజు, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను ఛేదించాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఛేదించాలని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ అన్నారు. జోగింపేట ప్రతిభా పాఠశాల (స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్) ను బుధ వారం ప్రాజెక్టు అధికారి సందర్శించారు. విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండాలని ఆయన ఉద్బోధించారు. చదువు పట్ల ఏకాగ్రత ఉండాలని ఆయన సూచించారు. ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నామో గ్రహించి వాటిపై కొంత శ్రద్ధ పెట్టాలని తద్వారా అందులో సంశయాలు తొలగుతాయని చెప్పారు. అప్పటికి సంశయాలు ఉంటే ఉపాధ్యాయుల వద్ద నివృత్తి చేసుకోవాలని చెప్పారు. తరగతుల్లో అంశాల వారీగా కొంత వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి తగు తర్ఫీదు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. తదుపరి కోర్సులు, ఇతర అవకాశాలు పట్ల విద్యార్థులకు మార్గదర్శకం చేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పట్ల దృష్టి సారిస్తూనే, మెనూ అమలులో పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. నాణ్యమైన ఆహారం, రక్షిత మంచినీరు సరఫరా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఆయన అన్నారు.

సీతానగరం మండలం పాపంవలస గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. రైతులు మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి రైస్ మిల్లులకు రవాణా చేసే ధాన్యానికి రవాణా చార్జీలు ఇవ్వడం జరుగుతుందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చే ధాన్యానికి గోనె సంచులు ధరలు కూడా చెల్లించడం జరుగుతుందని ఆయన వివరించారు.

# మేడ్ ఫర్ భారత్ ఈ కామర్స్ ఆవిష్కరణలను మరింతగా వృద్ధి చేసేందుకు తమిళ, తెలుగు యాప్ ఇంటర్‌ఫేజ్‌లను పరిచయం చేసిన షాప్సి

నెల్లూరు, (విశాఖ సమాచారమ్): భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న హైపర్ వాల్యూ ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్, షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ ఇప్పుడు తమ పరిధిని విస్తరించడానికి, వివిధ ప్రాంతాలలో ఎక్కువమంది వినియోగదారులకు సేవలనందించడానికి తమిళ, తెలుగు భాషలలో పరిచయం చేసింది. ఇది వినియోగదారులు తమ ప్రాధాన్యతా భాషను ఎంచుకునే అవకాశం కల్పించడంతో పాటు విస్తృత శ్రేణిలోని అందుబాటు ధరల ఉత్పత్తులను తమ ప్లాట్‌ఫామ్‌పై అతి సులభంగా పొందే అవకాశమూ అందిస్తుంది. నేడు షాప్సీ వినియోగదారులలో 68 శాతం మంది టైర్ 2 ఆ పైన నగరాలకు చెందిన వారు. వీరిలో దాదాపు 50 శాతం మంది మొట్టమొదటిసారిగా ఈ-కామర్స్ షాపర్లు. నూతన భాషను పరిచయం చేయడమన్నది దేశంలో మారుమూల ప్రాంతాల వినియోగదారుల నుంచి పెరుగుతున్న డిమాండ్ తీర్చడంలో భాగం.

షాప్సీ వద్ద అధ్యయనాలు వెల్లడించే దాని ప్రకారం, మెట్రోయేతర నగరాలలో నివాసముంటున్న వినియోగదారులు ఆంగ్లభాష పరిజ్ఞానం కలిగి ఉన్నప్పటికీ తమ మాతృభాషలో మరింత సౌకర్యం అనుభవిస్తున్నారు. ఉత్పత్తులను కనుగొనడం, ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయడం పరంగా అది వారికి మరింత సౌకర్యం అందిస్తుంది. ఈ ఫలితంగానే, షాప్సీ ఇప్పుడు రెండు ప్రాంతీయ భాషలను తమ ప్లాట్‌ఫామ్‌పై పరిచయం చేయడం ద్వారా వృద్ధి చెందుతున్న తమ వినియోగదారుల డిమాండ్‌ను తీరుస్తుంది.

దక్షిణ మధ్య రైల్వే
దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.
ఇ-టెండరు నోటీస్ నెం. డిఆర్ఎం/పనులు/బిజెడ్ఎ/25/2022 తేది. 05.12.2022
భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పని కొరకు ఆయా పనులకు ఎదురుగా సూచించిన తేదీలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.
క్ర.నెం.01 టెండరు నెం.: ఇ-29-ఈస్ట్-బిజెడ్ఎ-2022 పని పేరు : విజయవాడ డివిజన్: విజయవాడ-భీమవరం నిడదవోలు సెక్షన్- మండవల్లి మరియు అత్తిలి స్టేషన్ల వద్ద పెర్మనెంట్ వే డిపో ఎర్త్ వర్క్‌తో సహా అభివృద్ధి పరచుట. సహా. టెండరు విలువ (రూ): 2,22,21,418/- ధరావత్తు: (రూ). 2,61,100/- పూర్తి చేయు కాలము : 4 (నాలుగు) నెలలు.
ఔత్సాహిక టెండరుదారులు పై టెండరు ముగిసేయు తేదీకి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడినవేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ www.ireps.gov.in సందర్శించవలసిందిగా సూచించడమైనది
డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ
A1437
టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ "http//www.ireps.gov.in" లేదా www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.

# ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ

న్యూఢిల్లీ: 'నువ్వా-నేనా' అన్నట్టు సాగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మెజారిటీ మెజారిటి స్థానాలు దక్కించుకొని గెలుపు ఖాయం చేసుకుంది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘంగా మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏలిన బీజేపీ ఆశలకు ఆప్ గండికొట్టింది. ఎన్నికల కమిషన్ మధ్యాహ్నం 2.30 గంటల వరకూ అందుబాటులో ఉంచిన గణాంకాల ప్రకారం మొత్తం 250 వార్డుల్లో 126 వార్డులను ఆప్ సొంతం చేసుకుంది. 2007 నుంచి ఈ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏలిన బీజేపీ 97 సీట్లలో గెలవగా, మరో 6 వార్డుల్లో లీడింగ్‌లో ఉంది. ఫలితంగా ఎంసీడీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి ఖాయమైంది.

ఆప్ సంబరాలు..

మెజారిటీ మార్క్‌ను దాటి ఆప్ విజయం దిశగా దూసుకుపోవడంతో ఫలితాలు అధికారికంగా వెలువడక ముందే ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు సంబరాలు మొదలుపెట్టేశారు. ఢిల్లీలోని ఆప్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున కార్యకర్తలు నృత్యాలు చేస్తూ, కేజ్రీవాల్ నినాదాలు హోరెత్తించారు

# సైబర్ ఆన్లైన్ మోసాలపై అవగాహన సదస్సు.. కెనరా బ్యాంక్



పరవాడ, (విశాఖ సమాచారమ్): ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు: నాబార్డ్ వారి సౌజన్యంతో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో పరవాడ బ్రాంచ్ నేతృత్వంలో వై వెంకటేశ్వరరావు మ్యాజిక్ షో ప్రోగ్రామ్ తో సైబర్ నేరాలు ఆన్లైన్ మోసాలు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని బ్రాంచ్ మేనేజర్ బొడ్డు విజయ్ కుమార్ గ్రామ ప్రజలకు మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. కెనరా బ్యాంక్ యందు ఉన్న వివిధ రకాల ఋణ సదుపాయాలుతో పాటూ.. పొదుపు పై కెనరా బ్యాంకు ఇస్తున్న 7.50% వడ్డీ గురించి వివరిస్తూ.. ఇతర బ్యాంకులలో ఉన్న డ్వాక్రా సంఘాలు తమ అకౌంట్ కెనరా బ్యాంకు కి మార్చుకునే వెసులుబాటు గురించి వివరించి, ప్రస్తుత బ్యాంక్ ఇస్తున్న ఋణం తమవద్ద మార్చుకుని కొనసాగించుకొనవచ్చును అని చెప్పారు. అలానే నేడు సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పిస్తూ.. ఖాతాదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు.

కార్యక్రమంలో నర్సీపట్నంకు చెందిన ఎడవల్లి వెంకటేశ్వరరావు రామలింగయ్య కళాబృందం వారు మ్యాజిక్ షో తో ఆకట్టుకున్నారు. బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ తప్పకుండా పి ఎం జై జై బీ వై బీమా, పి ఎం ఎస్ బి వై బీమా, ఏపీ వై, సుకన్య సమృద్ధి యోజనా, పీ పీఎఫ అకౌంట్ చేయించుకోవాలని కళాకారులు వివరించారు.

# టీడీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బీసీ లు ఆందోళన

నెల్లూరు: నగరంలో టీడీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బీసీ లు ఆందోళన దిగారు. భిక్షాటనతో అర్ధనగ్న ప్రదర్శన, ఖాళీ పళ్లాలతో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మూడున్నరేళ్లలో బీసీలను అణగదొక్కారని బీసీ సంఘాలు మండిపడ్డాయి. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. బీసీలకు పనికిరాని పదవులిచ్చి మభ్యపెట్టారని బీసీ సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. రాయలసీమ గర్జన పేరుతో బీసీలను మళ్లీ మళ్లీ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీల అభ్యున్నతికి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. వారి సంక్షేమానికి కోట్లు ఖర్చు చేస్తున్నాం'.. జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తరచూ చెబుతున్న మాటలివి. కానీ.. బీసీ వర్గాలు వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని సోషల్ మీడియా వేదికగా గొంతెత్తి చాటుతున్నాయి. బీసీలకు టీడీపీ హయాంలో ప్రవేశ పెట్టిన కార్యక్రమాలు జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని సోషల్ మీడియా వేదికగా బీసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కానీ.. బీసీలకు తమ ప్రభుత్వం 'అంత చేసింది.. ఇంత చేసింది' అంటూ జగన్ ప్రభుత్వం 'బీసీ గర్జన' పేరుతో విజయవాడలో సభ నిర్వహించింది.ఒక పక్క ఈ సభ జరుగుతుండగానే.. బీసీలకు జగన్ సర్కార్ చేసిన అన్యాయాన్ని వివరిస్తూ.. అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతుండటం గమనార్హం. దేశవ్యాప్తంగా అనే హ్యాష్‌ట్యాగ్ టాప్‌లో ట్రెండ్ అయింది. టీడీపీ హయాంలో బీసీలకు జరిగిన మేలు, వైసీపీ హయాంలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ హ్యాష్ ట్యాగ్‌ను ఐటిడిపి ట్రెండ్ చేసింది. తమకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ఆ హ్యాష్‌ట్యాగ్‌ను జత చేస్తూ బీసీ వర్గాలు, బీసీ యువత ట్వీట్స్‌తో ట్విట్టర్‌ను హోరెత్తించింది.

# ఆకాశంలో వింత శకటం.. 'టైమ్ మిషన్' అంటూ ప్రచారం.. నిజమెంత?



మన బాలయ్య బాబు 'ఆదిత్య 369' సినిమాలోని టైమ్ మిషన్ తరహాలో ఒక యూఎఫ్ఓ నిన్నంతా ఆకాశంలో చక్కర్లు కొట్టింది. ఈ వింత శకటాన్ని హైదరాబాద్ వాసులతో పాటు చుట్టుపక్కల జనాలు తమ సెల్ ఫోన్లలో బంధించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా వైరల్ గా మారింది. ఈ నేపథ్యంలో ఈ వింత శకటంపై రకరకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

ఈ వింత శకటాన్ని చూసిన వారంతా ఇది కాలంతో ప్రయాణించే టైమ్ మిషన్ అని.. గ్రహాంతర వాసులు ఉపయోగించే యూఎఫ్ఓ అంటూ ఎవరికి వారు కథలు అల్లుతున్నారు. దీంతో ఈ వింత శకటం అసలు కథ ఏంటో తెలుసుకునేందుకు అంతా ఆసక్తి కనబరుస్తుండటంతో సోషల్ మీడియాతో ఈ శకటానికి సంబంధించి పలు వీడియోలు వైరలవుతున్నాయి.

నిన్నంతా ఆకాశంలో కన్పించిన ఈ వింత శకటం నేడు వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం మొగిలిగుండ్లోని ఓ పొలంలో ప్రత్యక్షమైంది. ఈ వింత శకటం ఎక్కడి నుంచి వచ్చి పడిందో తెలియక స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో రెవిన్యూ.. పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వింత శకటాన్ని పరిశీలించారు.

అయితే ఇది అందరూ అనుకున్నట్లుగా టైమ్ మిషనో.. గ్రహాంతర వాసులు ఉపయోగించే యూఎఫ్ఓ ను కాదని అధికారులు వెల్లడించారు. వాతావరణంలోని మార్పులను అధ్యయనం చేసేందుకు హీలియం బెలూన్ ను సైంటిస్టులు గగనతలంలోకి పంపిచినట్లు తెలిపారు. ఈ బెలూన్ ను ఫెసిలిటీ ఆఫ్ టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో వాతావరణంలోకి పంపారని వెల్లడించారు.

రెండ్రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వింత శకటం టైమ్ మిషనో.. యూఎఫ్ఓ నో కాదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఏది ఏమైనా ఈ హీలియం బెలూన్ మాత్రం 'ఆదిత్య 369' మూవీలో టైమ్ మిషన్ తరహాలోనే ఉందనే అభిప్రాయం మాత్రం వ్యక్తమవుతోంది. దీనిపై మీ రియాక్షన్ ఏంటో కింద మాతో పంచుకోండి.

# కరపలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ ఛైర్మన్



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ఆకలి మరణాలు అనేవి లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలు, రాయితీలను అందిస్తున్నాయని.. వీటి ఫలాలు అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు అందేందుకు అధికారులు కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి.. కమిషన్ సభ్యులు జె.కృష్ణకిరణ్, పౌర సరఫరాలు, ఐసీడీఎస్, విద్య తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కాకినాడ అర్బన్ కచేరిపేటలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న తీరును పరిశీలించారు. ప్రజలకు పంపిణీ చేస్తున్న బియ్యం, కందిపప్పు తదితర సరుకుల నాణ్యతను పరిశీలించారు. కాకినాడ జగన్నాథపురంలో ఎ.శ్రీనివాసరావుకు చెందిన చౌక ధరల దుకాణాన్ని, అన్నమ్మఘాటిలో ఎంవీవీ సత్యనారాయణ చౌక ధరల దుకాణాన్నిఛైర్మన్ తనిఖీ చేశారు.

కరప మండలం, పెనుగుదురు గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని, మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరపలోని శ్రీ నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజనాలను, సరుకుల నాణ్యతను పరిశీలించి పాఠశాల విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యం ప్రాధాన్యం, పోషక విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వేలంగిలోని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఎంఎల్ఎస్ పాయింటును సందర్శించి బియ్యం బస్తాలు, కందిపప్పు నిల్వను పరిశీలించి హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురజానపల్లి గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. పౌష్టికాహారం అందించే ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మధ్యాహ్న భోజనం పాఠశాలలో చేయాలని సూచించారు. చివరిగా జగన్నాథపురం సెంటర్లో ఉన్న బచ్చు రామం నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విజయ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 పరిధిలో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఏర్పడిందని.. ఈ కమిషన్‌కు తాను రెండో ఛైర్మన్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. 2022, మార్చిలో బాధ్యతలు స్వీకరించిన దగ్గరి నుంచి ఇప్పటి వరకు 475 వరకు కేంద్రాలను సందర్శించినట్లు వెల్లడించారు. పౌర సరఫరాల వ్యవస్థ ఆహార ధాన్యాల పంపిణీ, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)పై కమిషన్ దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తూ లోటుపాట్లను గుర్తిస్తూ.. సరిదిద్దుతున్నట్లు వెల్లడించారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల అమల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి అనేది ఉండకూడదని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది నీతినిజాయితీలతో పనిచేయాలని విజయ ప్రతాప్‌రెడ్డి సూచించారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటన ప్రారంభమైందని గురువారం ఉదయం వరకు జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఫుడ్ కమిషన్ ఛైర్మన్ వెంట ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, సివిల్ సప్లయ్స్ డీఎం డి.పుష్పమణి, జిల్లా పౌరసరఫరాల అధికారి డి.చాముండేశ్వరి, ఏఎస్‌వో టి.ప్రసన్న లక్ష్మీదేవి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, ఇన్‌ఛార్జ్ డీఈవో ఆర్‌జే డానియల్ రాజు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.డి.సలీమ్ తదితరులు ఉన్నారు.

# కార్మిక నేత ఎస్ గోపాల్ కు ఘన నివాళి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర జిల్లాల కార్మిక నేతగా కార్మికుల పక్షాన నిలిచి వారి హక్కుల కోసం నిరంతర శ్రమించిన శ్రీరంగం గోపాల్ 9 వ వర్ధంతి సందర్భంగా భవన నిర్మాణరంగా కార్మికులతో పాటు తోపుడు బళ్ళు కార్మికులు బుధవారం అల్లిపురం యూనియన్ ఆఫీసులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన సోదరుడు రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్ దివాకర్ పాల్గొని మాట్లాడారు ఆయనతో ఉన్న అనుబంధాన్ని అసంఘటి రంగా కార్మికులకు వివరించారు. ఆయన లేని లోటు కుటుంబ సభ్యులతో పాటు చిన్నచిన్న కూలి పనులు చేసుకున్న కార్మికులకు తీరని లోటుగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. ఐ.ఎన్.సి. క్యాజువల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. మురళీకృష్ణ మాట్లాడుతూ ఈస్టర్న్ నేవల్ కమాండ్ పరిధిలో ఉన్న డాక్ యార్డ్, బి.వి.యార్డ్ డైలీ వేజ్ కార్మికుల వేతనం, ఉద్యోగ భద్రత వారి హక్కుల కోసం నిరంతరం కృషి చేసేవారు. నగరంలో అనేక కార్మిక సంఘాల ఏర్పాటు చేసి ఆటో రిక్షా, భవన నిర్మాణ, పరిశ్రమలలో పని చేసిన దినసర వేతన కూలీల కోసం ఎంతగానో శ్రమించి వారి సమస్యలను వినతి పత్రాల్లో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లే వారిని ఆయన అన్నారు. తోపుడు బళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు అప్పయ్య దొర మాట్లాడుతూ అల్లిపురం ప్రాంతంలో ఉన్న అనేకమంది తోపుడు బండ్లు తో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న కార్మికులకు 150 మందికి పైగా ప్రభుత్వ గృహాలు అప్పటి స్థానిక ఎమ్మెల్యే ద్రోణం రాజ శ్రీనివాస్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి గారితో మాట్లాడి ఇప్పించడం జరిగిందని కార్మికులకు అండ గా నిలిచే ఆయన లేకపోవడం దిక్కుతోచని స్థితిలో ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పల రెడ్డి, సిహెచ్ నాగరాజు, ఐ సురేష్ కుమార్, జగన్ భవన నిర్మాణ రంగ మహిళ కార్మికులతో పాటు తోపుడు పళ్ళు కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# వైద్యం కోసం వచ్చే వారికి కనీస సౌకర్యాలు మెరుగు పర్చాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర జిల్లాలో ప్రముఖ వైద్య శాలయిన కె.జి.హెచ్ కు ప్రతి రోజు అనేక మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారని వారికి కనీస సౌకర్యాలు అందేటట్లు వైద్య సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కె.జి.హెచ్ ఆసుపత్రిలో ఒపి స్లిప్, కేస్ షీట్లు మంజూరు చేయు గదిని, క్యూలైన్లను పార్కింగ్ ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేస్ షీట్లు మంజూరు చేయు గదిని మరమ్మత్తులు చేయాలని అదే విధంగా రోగులు ఒపి స్లిప్ లు పొందేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రోగులతో పాటు వచ్చే వారికి కూడా మరుగుదొడ్లు ఇబ్బంది లేకుండా నిర్మించాలన్నారు. పార్కింగ్ సదుపాయాన్ని మెరుగు పర్చాలన్నారు . ఓపి గేటు ఎదురుగా ఉన్న మినీ పార్కును సుందరీకరించాలని ఆదేశించారు. అనంతరం వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్నవైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్ సూపరింటెండెంట్ మైథిలీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యూ పి హెచ్ సి సెంటర్ ల లో మహాసభలు



ఆరిలోవ, (విశాఖ సమాచారమ్): జీవీఎంసీ 13వ వార్డు యూ.పి.హెచ్.సి సెంటర్లలో ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ 4వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో డిసెంబర్ 12, 13తేదీలలో జరుగుతున్న స దర్భంగా మహాసభల పోస్టర్ ను ఆశ కార్యకర్తలు ఆయా సెంటర్లలో ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆశలకు కనీస వేతనం రూ.26 వేలు రూపాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, ఈ.స.ఐ, పి.ప్ వర్తింపచేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నినాదాలు చేశారు.

# స్వామి వారిని దర్శించుకున్న సినీ ప్రొడ్యూసర్ కళ్యాణ్



సింహాచలం, (విశాఖ సమాచారమ్): సినీ ప్రొడ్యూసర్ సి కళ్యాణ్ శ్రీ వరహా లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ముందుగా కప్ప స్తంభం ఆ లింగనము తదుపరి స్వామి వారి దర్శనము అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వచనము చేయించి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి నరసింహారాజు స్వామివారి ప్రసాదాలను అందించారు. వీరితో లంక సూరిబాబు తదితరులు ఉన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
REGIONAL STRESSED ASSET RECOVERY BRANCH, NAGPUR
Mytri Willows, 2nd Floor, Opp. Empress Mall, Above Lotus Electronics, Sir Bezonjee Mehta Road, Nagpur - 440018.

సవరణ ప్రకటన

ది. 02/12/2022 తేదీన ప్రచురించబడిన మెసర్స్ జోగ్ మా ల్యామినేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి సంబంధించిన ఈ-వేలం ప్రకటన యందలి ప్రాపర్టీ సీరియల్ నెంబరు 1ని వారి డైరెక్టర్ల ద్వారా (మూల శాఖ : దరంపేట్) ను సాంకేతిక కారణముల వలన 20/12/2022 తేదీన జరుగవలసిన ఈ-వేలం షెడ్యూల్ నుండి రద్దు చేయబడినది అని ఇందుమూలంగా సంబంధిత ప్రజాబాహుళ్యానికి తెలియపరచడమైనది. అమ్మకం ప్రకటన యందలి ఇతర నియమనిబంధనలు యథాతథంగా యుండును.

తేది : 08/12/2022 అధీకృత అధికారి
ప్రదేశం: నాగ్‌పూర్ బ్యాంక్ ఆఫ్ బరోడా

# మాజీ జేడీ లక్ష్మీనారాయణకు టీడీపీ బంపరాఫర్..!?

ఏపీలో ముందస్తుగానే ఎన్నికల కసరత్తు మొదలైంది. సీఎం జగన్ వై నాట్ 175 అంటూ ముందుకెళ్తున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు 100 శాతం గెలుపు టీడీపీదే అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అటు పవన్ లక్ష్యం కూడా వైసీపీ ఓటమే. బీజేపీ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ఇదే సమయంలో పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్ధుల ఎంపిక పైనా అధినేతలు ఫోకస్ పెట్టారు. అందులో భాగంగా టీడీపీలో కీలకమైన నేతలకు వైసీపీ గాలం వేస్తోంది. జగన్ కు వ్యతిరేకమైన వారిని తమ వైపు తిప్పుకొనే ప్రయత్నంలో టీడీపీ ఉంది. ఇప్పుడు ఆ లిస్టులో వైఎస్ వివేకా కుమార్తెతో పాటుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ చేరారు.

2024 ఎన్నికలకు లక్ష్మీనారాయణ సిద్దం.. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పదవిలో ఉన్నప్పుడు ఒక విధంగా ఫేమస్ అయితే, రిటైరైన తరువాత కూడా వార్తల్లో నిలుస్తున్నారు. జగన్ పైన నాడు సీబీఐ విచారణ సమయంలో లక్ష్మీనారాయణ విచారణాధికారిగా వ్యవహరించారు. విచారణ కు సంబంధించిన వార్తలు టీడీపీకి మద్దతుగా నిలుస్తుందనే ప్రచారంలో ఉన్న మీడియాలో రోజూ ప్రచురితం అయ్యేవి. లక్ష్మీనారాయణ నాడు విచారణాధికారిగా జగన్ కు వ్యతిరేకంగా టీడీపీకి మద్దతుగా వ్యవహరిస్తున్నారంటూ అప్పట్లోనే వైసీపీ నేతలు ఆరోపించే వారు. ఆ తరువాత లక్ష్మీనారాయణ ఏపీ నుంచి బదిలీ అయ్యారు. జగన్ రాజకీయంగా బీజీ అయ్యారు. ఇప్పుడు ఏపీ సీఎం అయ్యారు. ఇక, 2019 ఎన్నికల్లో అనేక తర్జన భర్జనల తరువాత జేడీ లక్ష్మీనారాయణ ఎట్టకేలకు జనసేనలో ఎంట్రీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో జగన్ అభ్యర్ధి చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తరువాత జనసేన నుంచి బయటకు వచ్చేసారు. కానీ, ఇప్పుడు 2024 ఎన్నికల్లో తాను పోటీకి సిద్దమని లక్ష్మీనారాయణ స్పష్టం చేసారు.

విశాఖ నుంచే మరోసారి బరిలోకి.. 2019 లో ఓడిన చోటే మరోసారి పోటీ చేసి గెలవాలనేది మాజీ జేడీ లక్ష్మీనారాయణ నిర్ణయం. ఇందు కోసం వ్యూహాత్మకంగా 2019 ఎన్నికల తరువాత నుంచి విశాఖ కేంద్రంగానే కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. అయితే, ఏ పార్టీ నుంచి పోటీ చేస్తాననేది చెప్పలేనని..విశాఖ నుంచి పోటీ ఉంటుందని మాత్రం జేడీ పలు మార్లు క్లారిటీ ఇచ్చారు. జేడీకి పార్లమెంట్ కు పోటీ చేయాలనేది లక్ష్యంగా కనిపిస్తోంది. తాజాగా జనసేన -టీడీపీ - బీజేపీ పొత్తు వార్తల నడుమ జేడీ ఏ నిర్ణయం ప్రకటించేదనే విషయం అర్ధం అవుతోంది. తాను పని చేసి వచ్చిన జనసేనలోకే మాజీ జేడీ రీ ఎంట్రీ ఇస్తారని ప్రచారం సాగినా.. ఆ అవకాశాలు లేవని తెలుస్తోంది. బీజేపీలోకి ఇప్పటికే ఆయనకు ఆఫర్ వచ్చింది. కానీ, బీజేపీలోకి వెళ్లటం పైన ఆయన అంత ఆసక్తి లేరని సమాచారం. బీజేపీలో చేరి ఆ పార్టీలో పోటీ చేసిన తిరిగి జనసేన లేదా టీడీపీతో పొత్తు ద్వారానే వెళ్లాల్సి ఉంటుందనే అభిప్రాయంతో ఉన్నట్లుగా సమాచారం. ఈ సమయంలోనే అవసరమైనే ఇండిపెండెంట్ గా పోటీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

టీడీపీ నుంచి ఆఫర్ - అంగీకరిస్తే..!? సీబీఐ మాజీ జేడికి టీడీపీ నుంచి తాజాగా ఆఫర్ వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. లక్ష్మీనారాయణ పార్టీలోకి వస్తే విశాఖ సీటు ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నట్లు పార్టీ ముఖ్య నేతల్లో చర్చ సాగుతోంది. 2014 ఎన్నికల సమయంలోనే లక్ష్మీనారాయణ టీడీపీలో చేరుతారనే ప్రచారం సాగింది. కానీ, అప్పటికే జగన్ కేసులు విచారించి ఉండటం..టీడీపీతో లక్ష్మీనారాయణ సంబంధాల పైన విమర్శలు ఉండటంతో ఆ సమయంలో చేరలేదని చెబుతున్నారు. ఇక, ఇప్పుడు విశాఖ కేంద్రంగా టీడీపీని దెబ్బ కొట్టే వ్యూహాలను వైసీపీ మొదలు పెట్టింది. టీడీపీ ఎమ్మెల్యే గంటా సైతం వైసీపీలో చేరుతారని ప్రచారం సాగుతోంది. దీంతో, విశాఖలో ఇప్పటికే స్టీల్ ప్లాంట్ కార్మికుల కోసం లక్ష్మీనారాయణ న్యాయ పోరాటం చేస్తున్నారు. విశాఖ నుంచే లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వటానికి టీడీపీ సిద్దంగా ఉందని చెబుతున్నారు. దీనికి లక్ష్మీనారాయణ ఆమోదం చెబితే..వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచే బరిలో నిలవటం ఖాయం కానుంది.

# 1200 మంది విద్యార్థులపై విషప్రయోగం..పరిస్థితి సీరియస్..!



న్యూఢిల్లీ: ఇరాన్ లో నైతిక పోలీస్ విభాగాన్ని రద్దు చేయాలని కోరుతూ యూనివర్సిటీ విద్యార్థులు కొద్దిరోజులుగా నిరనసలు తెలియజేస్తున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే క్రమంలో విద్యార్థులు పలు ఆందోళన కార్యక్రమాలు పిలుపునిచ్చారు. అయితే ఆందోళన తేదికి ఒకరోజు ముందు విద్యార్థులపై విషప్రయోగం జరగడం సంచలనంగా మారింది.పూర్తి వివరాల్లోకి వెళితే.. ఖరాజమీ.. అర్క్ విశ్వవిద్యాలయం సహా మర నాలుగు యూనివర్సిటీ విద్యార్థులు నైతిక పోలీస్ విభాగాన్ని రద్దు చేయాలనే నినాదంతో ఇటీవల సమావేశం నిర్వహించుకున్నారు. 1200 మంది విద్యార్థులు పాల్గొని ఆందోళన కార్యక్రమాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆందోళన తేదికి ముందు రోజు రాత్రి యూనివర్సిటీలో ఆహారం తిన్న విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.ఈ ఘటనపై ది నేషనల్ స్టూడెంట్ యూనియన్ నాయకులు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ప్రభుత్వం విష ప్రయోగం చేయడ వల్లే విద్యార్థులు వాంతులు.. విరేచనాలు.. తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరారని తెలిపారు. రాత్రి పూట చాలావరకు వైద్య శాలలు మూసి ఉండటంతోపాటు డీహైడ్రేషన్ కు సంబంధించి ఔషధాలు కొరత ఏర్పడడంతో చాలా ఇబ్బందులు పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీలోని కెఫెటేరియాలో తినుబండరాలు తినకూడదని నిర్ణయం తీసుకున్నారు. అయితే అధికారులు మాత్రం నీటిలో కలుషిత బ్యాక్టీరియా వల్లే ఇలా జరిగి ఉంటుందని చెబుతున్నారు. అయితే గతంలో తమకు ఎదురైన అనుభవాల దృష్ట్యా అధికారులు ఈ కుట్ర చేసి ఉంటారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.ఇరాన్ లో విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఇరాన్ ప్రాసిక్యూటర్ జాఫర్ మోంటజెరీ నైతిక పోలీస్ విభాగాన్ని తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రాకపోవడంతో యథావిధిగానే ఆందోళనలు కొనసాగుతున్నాయి. కాగా అంతర్జాతీయ రాక్ క్లైంబింగ్ పోటీల్లో హిజాబ్ ధరించకుండా పాల్గొన్న ఇరాన్ క్రీడాకారిణి ఎల్నాజ్ రెకబీ ఇంటిపై అధికారులు దాడి ధ్వంసం చేయడం చేసినట్లు వెలుగులోకి వచ్చింది.ఇరాన్ లో నైతిక పోలీస్ విభాగాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించిన తెల్లారే ఇరానియన్ వైర్ పత్రికలో ఈ దాడిపై కథనం వెలువడింది. ఎల్నాజ్ ఇంటిపై దాడి సందర్భంగా ఆమె సాధించిన పతకాలను రోడ్లపై పారేసిన దృశ్యాలను ఇరానియన్ వైర్ ప్రముఖంగా ప్రచురించింది. ఈ సంఘటనతో ప్రభుత్వంపై ప్రజల్లో సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# రోజురోజుకు దిగజారి పోతున్న రూపాయి విలువ



న్యూఢిల్లీ: రూపాయి విలువ రోజు రోజుకు కనిష్ట స్థాయికి పడిపోతుంది. రూపాయి విలువను పడిపోకుండా ఆర్బీఐ చర్యలు చేపడుతున్నప్పటికీ సత్ఫలితాలు మాత్రం రావడం లేదు. ఈ క్రమంలోనే బుధవారం ఆర్బీఐ ద్రవ్య విధానానికి ముందు ప్రారంభ ట్రేడింగ్ లో యూఎస్ డాలర్ తో రూపాయి విలువ 25 పైసలు క్షీణించి 82.75 వద్ద ట్రేడింగ్ కు చేరుకుంది.విదేశీ మార్కెట్లో డాలర్ కు రోజురోజుకు డిమాండ్ పెరిగి పోతుండటం.. విదేశీ నిధుల తరలింపు వంటి ఇన్వెస్టర్ల సెంటిమెంట్ ట్రేడింగ్ పై ప్రభావం చూపుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద.. దేశీయ యూనిట్ డాలర్తో పోలిస్తే 82.74 వద్ద ప్రారంభమైందని తెలిపారు.ఆ తర్వాత దాని మునుపటి ముగింపుతో పోలిస్తే ఏకంగా 25 పైసల నష్టాన్ని నమోదు చేసి 82.75 స్థాయికి రూపాయి దిగజారిందని వెల్లడించారు. కాగా మంగళవారం రూపాయి విలువ ఏకంగా 65 పైసలు క్షీణించిందని తెలిపారు.

యూఎస్ డాలర్ తో పోలిస్తే ఒక నెల దిగువ స్థాయికి అంటే రూ. 82.50 కి పడిపోయిందని తెలిపారు.మరోవైపు ప్రపంచ చమురు బెంచ్మార్క్ అయిన బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ బ్యారెల్కు 0.09శాత మేర పెరిగి 79.42 డాలర్లకు చేరింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప నష్టాల్లో కొనసాగాయి. 30 షేర్ బీఎస్ఈ సెన్సెక్స్ 148 పాయింట్లు క్షీణించి 62478 వద్ద ట్రేడ్ కాగా నిఫ్టీ 50 పాయింట్లు లేదా 0.17శాతం మేర తగ్గి 18580 వద్ద ట్రేడయింది.విదేశీ ఇన్వెస్టర్లు మంగళవారం రోజున 635.35 కోట్ల విలువైన షేర్లను అఫ్లోడ్ చేయడంతో క్యాపిటల్ మార్కెట్లో నికర విక్రయదారులుగా మారిపోయారు. ఈ క్రమంలోనే ఆర్బీఐ రెపో రేటును తాజాగా 35 బేసిస్ పాయింట్స్ పెంచింది. అయితే రూపాయి విలువ పతనం అవుతుండటంతో విదేశీ మారకం క్రమంగా తగ్గుతూ పోతుంది. దీని వల్ల రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరుగుతాయనే హెచ్చరికలు విన్పిస్తున్నాయి.

రూపాయి పతనం పెట్రోల్.. డీజిల్ రేట్ల పెరుగదలపై ప్రభావం చూపనుంది. అది కనుక జరిగితే నిత్యావసర ధరలు మరింత పెరగడం ఖాయం. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సామాన్యుడు నానా ఇబ్బందులు పడున్నాడు. ఈ క్రమంలోనే రూపాయి ధరకు కళ్లెం వేసేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. రూపాయి కరెన్సీతోనే పలు దేశాలతో మారకం జరిగేలా కేంద్రం ఒప్పందాలు చేసుకుంటోంది.

# బీసీలకు జరుగుతున్న అన్యాయంపై డిఆర్ఓకు వినతిపత్రం సమర్పించిన తెదేపా



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అదేశాలు మేరకు ఇదేం ఖర్మ మన బీసీలకు చలో కలెక్టరేట్ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ పార్లమెంటు కార్యాలయం పార్లమెంట్ అధ్యక్షులుబుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంచార్జిలు,నాయకులు, కార్యకర్తలుతో కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై డిఆర్ఓ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుల్లోను ఆటల్లో ను స్ఫూర్తితో ముందుకు సాగాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విద్యార్ధులు చదువుల్లోను ఆటల్లోను స్ఫూర్తితో గెలుపొంది ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున అన్నారు. బుధవారం ఉదయం స్థానిక పాత పోస్టాఫీసు వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్వీన్ మేరీని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఫార్మేటివ్-2 పరీక్షల జవాబు పత్రాలను పరిశీలించి, విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చదువులలోనూ ఆటల్లోనూ విద్యార్థులు మంచి స్ఫూర్తితో పురోగతి సాధించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి పౌరులుగా దేశానికి సేవ చేయాలని ఉద్బోధించారు. విద్యార్థుల ప్రగతికి, క్రమశిక్షణకు సంబంధించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడంతో పాటు "లీడ్ తరగతులను" పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఫార్మేటివ్-2 పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల క్వీన్ మేరీ ప్రధానోపాధ్యాయులు ఏ ధర్మేందర్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.